


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 198 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 26 నవంబర్ 2025 | వెల : 4/-



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


# మాట ఇస్తే... తప్పే ప్రసక్తే లేదు



- సర్పంచ్ ఎన్నికలు.. బంపరాఫర్ ప్రకటించిన బండి సంజయ్!
- తమ పార్టీ బలపరిచే అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే.. రూ.10 లక్షల ప్రోత్సాహక నిధులిస్తా
- కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద నయాపైసా నిధుల్లేవు
- నిధులు తెచ్చేది, ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే
- ఎన్నికలు జరిగేది కూడా కేంద్ర నిధుల కోసమే.



## ఈ నెల 30న అఖిలపక్ష భేటీ


- ఈ కాలంలో 15 సిట్టింగ్‌లు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు
- శీతాకాల సమావేశాల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి
- ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బిల్లులపై, చర్చకు వచ్చే ముఖ్య అంశాలపై, విపక్షాల సహకారం అవసరంపై చర్చించనుంది
- త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం

# మోగిన నగారా

**తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల**



- మూడు విడతల్లో తెలంగాణ పంచాయతీ ఎన్నికలు
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- నేటి నుంచి అమల్లోకి ఎన్నికల నియమావళి
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అబ్జర్వర్లు, ఎలక్షన్ అబ్జర్వర్లను నియమించాం
- 31 జిల్లాల్లో మూడు విడతల్లో ఎన్నికలు
- కోటి 66 లక్షలకుపైగా ఓటర్లు



హైదరాబాద్

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సాయంత్రం మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం - మిగతా3లో

# జీహెచ్ఎంసీలో లోకల్‌బాడీలు

**జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు విలీనం.. తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు**



- విద్యుత్ ఉత్పాదన పెంచేందుకు 3 వేల మెగావాట్ల కోసం టెండర్లకు ఆహ్వానం
- హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్‌కు ఆమోదం
- విద్యుత్ నెట్‌వర్క్ వైర్లన్నీ అండర్‌గ్రౌండ్‌లోనే ఉండేలా ప్రణాళిక అమలు
- మహా నగరాన్ని 3 విభాగాలు విభజించి అండర్ గ్రౌండ్ పనులు

హైదరాబాద్

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ శివారులో ఉన్న మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అలాగే.. అలాగే విద్యుత్ రంగం ప్రధానంగా ఈ భేటీ జరిగినట్లు మంత్రులు వెల్లడించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాటలాడుతూ.. ఆదిభట్ల, పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి.. ఇలా అర్బన్ లోకల్‌బాడీలను జీహెచ్ఎంసీలో విలీనానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ఈ 27 మున్సిపాలిటీలు ,కార్పోరేషన్ లను జీహెఎంసీ లో - మిగతా3లో

## నన్ను చాలెంజ్ చేస్తే.. బీజేపీ పునాదులే కదిలిస్తా

- బీజేపీ సర్ ప్రక్రియను ఉపయోగించి ఓటర్లను తొలగిస్తోందని
- బీజేపీ రాజకీయంగా తనను ఓడించలేదని గతంలోనే పదిసార్లు చెప్పా
- 'అక్రమ బంగ్లాదేశీయులను" తొలగించడమే లక్ష్యమైతే, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఎందుకు నిర్వహిస్తున్నారు
- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ





## మేం సంపద కోసం అధికారంలోకి రాలేదు

- ఇన్ని నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రజలు అడుగుతున్నారు
- ప్రభుత్వ నిధులను పూర్తిగా ప్రజల కోసమే వినియోగిస్తున్నాం
- ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కానివ్వడంలేదు
- ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్

## రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో అదానీ, అంబానీలను క్రాస్ చేయాలని అనుకుంటున్నాడు

- కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ
- 50-60 ఏళ్లుగా హైదరాబాద్‌లో 21 పారిశ్రామికవాడలు ఏర్పడ్డాయి
- ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చింది
- మేం అధికారంలో ఉన్నప్పుడు కూడా పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చాయి

హైదరాబాద్

రేవంత్ రెడ్డి అవినీతి కోసమే హిల్ట్ పాలసీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ అని అన్నారు. విద్యార్థులు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతూ రేవంత్ సర్కార్ హిల్ట్ పాలసీకి నిర్ణయం తీసుకుందని కేటీఆర్ అన్నారు ఒకప్పుడు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములను ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతినిస్తోందని తెలిపారు. 50-60 ఏళ్లుగా హైదరాబాద్‌లో 21 పారిశ్రామికవాడలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిందని చెప్పారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ పరిశ్రమలు మధ్యలోకి వచ్చాయని - మిగతా3లో



# కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు



- తాజాగా 28 మంది సరెండర్
- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ
- లొంగిపోయిన వారిలో 19 మంది మహిళలు
- వీరిపై రూ. 89 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడి
- 'పున మర్గం' కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నాయన్న అధికారులు
- ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోలు

# నన్ను చాలెంజ్ చేస్తే.. బీజేపీ పునాదులే కదిలిస్తా



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు పశ్చిమ బెంగాల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. బీజేపీ సర్ ప్రక్రియను ఉపయోగించి ఓటర్లను తొలగిస్తోందని తృణమూల్ ఆరోపిస్తోంది. మంగళవారం జరిగిన ఎస్‌ఐఆర్ వ్యతిరేక ర్యాలీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తనను చాలెంజ్ చేస్తే దేశంలో బీజేపీ పునాదులు కదిలిస్తానని మమత వ్యాఖ్యానించారు. బొంగావ్‌లో జరిగిన ఎస్‌ఐఆర్ వ్యతిరేక ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగిస్తూ, రాష్ట్రంలోని మతువా-మెజారిటీ ప్రాంతాలలోని ఓటర్లు పౌరసత్వం (సవరణ) చట్టం ప్రకారం తమను తాము విదేశీయులుగా ప్రకటిస్తే వారిని "వెంటనే జాబితా నుండి తొలగిస్తారు" అని కూడా మమతా బెనర్జీ పేర్కొన్నారు. బీజేపీ రాజకీయంగా తనను ఓడించలేదని గతంలోనే పదిసార్లు చెప్పానని మమత మరోసారి నొక్కి వక్కాణించారు. అంతేకాదు ఎన్నికల కమిషన్ ఇకపై నిష్పాక్షిక సంస్థ కాదు, కానీ బిజెపి కమిషన్‌గా మారిపోయిందంటూ భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)పై విమర్శలు గుప్పించారు. 'అక్రమ బంగ్లాదేశీయుల ను" తొలగించడమే లక్ష్యమైతే, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్ ఎందుకు నిర్వహిస్తు న్నారని మమత ప్రశ్నించారు. అంటే పార్టీ "డబుల్ ఇంజిన్ పాలిత రాష్ట్రాల్లో కూడా చొరబాటుదారులు ఉన్నారని అంగీకరిస్తుందా అని ఆమె ఎద్దేవా చేశారు. తానుఒక దేశంగా బంగ్లాదేశ్‌ను ప్రేమిస్తున్నాననీ తమ భాషా ఒకటేనని చెప్పారు. ఏదో ఒకరోజు తనను కూడా బంగ్లాదేశీ అని పిలుస్తారని విమర్శించారు. ఈ రాష్ట్రం నుంచి ఈ జాబితా ప్రకారమే 2024లో ప్రధాని మోదీ ఓట్లు గెల్చుకున్నారు. మరి ఆ ఓట్లు తీసేస్తే కేంద్ర ప్రభుత్వం కూడా తొలగించాలా కదా అన్నారు. అసలు సర్ నిర్వహణకు ఎందుకు ఇంత తొందర పడుతున్నారని సీఎం మమత ప్రశ్నించారు. "నేను ఇక్కడ ఉన్నంత వరకు, వారు మిమ్మల్ని వెళ్లగొట్టడానికి నేను అనుమతించను. ఎవరూ మిమ్మల్ని వెళ్లగొట్టలేరు" అంటూ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. ఇక్కడ బంగ్లాదేశీయులే సమస్య అయితే, మధ్యప్రదేశ్ , యుపీలో%ూ×=% ఎందుకు నిర్వహిస్తున్నారు? అని మమతా అటు ఈసీపైనా, ఇటు బీజేపీపైనా నిప్పులు చెరిగారు. కాగా ఇటీవలి బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం తరువాత బిహార్ గెలిచేశాం. ఇక పశ్చిమ బెంగాల్ వంతు అని బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలకే కౌంటర్‌గానే మమతీ ప్రతిసవాల్ చేసినట్టుగా భావిస్తున్నారు.

# 5 జోన్లు, 12 మంది లీడర్స్..
# బెంగాల్‌పై బీజేపీ ఫోకస్!



బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన కమలం పార్టీ పశ్చిమ బెంగాల్‌పై ఫోకస్ పెట్టింది. వచ్చే ఏడాది ప్రథమార్థంలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కసరత్తు ప్రారంభించింది. బిహార్ ఎన్నికలు ముగిసిన వెంటనే బెంగాల్ ఎన్నికల ప్రచార కార్యాచరణ చేపట్టింది. ఎన్నికలకు 5 నెలలు ముందుగానే ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రాన్ని ఐదు జోన్‌లుగా విభజించి, ఆరు రాష్ట్రాల నుంచి 12 మంది సీనియర్ నాయకులకు ప్రచార బాధ్యతలు అప్పగించింది. పశ్చిమ బెంగాల్‌లోనూ జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తామని బిహార్ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బిహార్ విజయం బెంగాల్‌లో గెలుపునకు బాట వేసిందని వ్యాఖ్యానించారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా ఇదేరకమైన వ్యాఖ్యలు చేశారు. తమ తదుపరి లక్ష్యం బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేయడమేనని ఉద్ఘాటించారు. బెంగాల్‌లో అరాచక పాలనకు చరమగీతం పాడతామని ప్రతిన బూనారు. వీరి మాటలను బట్టి చూస్తేనే అర్థమవుతుంది.. బెంగాల్ ఎన్నికలను బీజేపీ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో.

**త్రిముఖ వ్యూహం**

బెంగాల్‌లో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పదిహేనేళ్ల పాలనకు ముగింపు పలికి అధికారాన్ని దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది బీజేపీ. ఇందుకోసం క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. పశ్చిమ బెంగాల్‌ను 5 అధిక ప్రాధాన్యత గల జోన్‌లుగా విభజించి.. ప్రతి జోన్‌కు ఒక మంత్రిని, ఒక సీనియర్ రాజకీయ నాయకుడిని నియమించారు. వీరంతా ఎన్నికల వరకు బెంగాల్‌లోనే మకాం వేస్తారు. బీజేపీ క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, బూత్-స్థాయి యంత్రాంగాన్ని ఏకీకృతం చేయడం, తృణమూల్ కాంగ్రెస్ బలమైన కోటల్లోకి ప్రవేశించడం వంటి లక్ష్యాలతో వీరు పనిచేస్తారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఏప్రిల్-మే నెలల్లో జరగనున్నాయి.

**రాధా-బంగా జోన్ (పురులియా-బర్ధమాన్)**

పురులియా, బర్ధమాన్‌లో తమ పార్టీ ఉనికిని పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లోగా సంస్థాగతంగా బలపడాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీంతో ఈ జోన్‌కు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) పవన్ సాయిని పర్యవేక్షుడిగా బీజేపీ అధినాయకత్వం నియమించింది. ఉత్తరాఖండ్ మంత్రి ధన్ సింగ్ రావత్ సహ-పర్యవేక్షుడిగా బాధ్యతలు అప్పగించింది.

**హౌరా-హూగ్లీ-మేదినీపూర్ జోన్**

హౌరా-హూగ్లీ పర్యవేక్షణను ఢిల్లీ సంస్థాగత మంత్రి పవన్ రాణా చూసుకుంటారు. ఆయనకు హరియాణాకు చెందిన సీనియర్ సంజయ్ భాటియా సహకారం అందిస్తారు. మేదినీపూర్ బాధ్యతలు ఉత్తరప్రదేశ్ మంత్రి జేపీఎస్ రాథోడ్‌కు కట్టబెట్టారు. టీఎంసీ- బీజేపీ మధ్య ఘర్షణలతో రాజకీయంగా సున్నితమైన ప్రాంతంగా మేదినీపూర్‌ను పరిగణిస్తున్నారు. బీజేపీ నేత సువేందు అధికారి ప్రభావం ఇక్కడ ఎక్కువగా ఉందన్న ప్రచారం జరుగుతోంది.

**కోల్‌కతా మెట్రోపాలిటన్ -సౌత్ 24 పరగణాలు**

బీజేపీ అత్యంత కఠినమైన ప్రాంతాలలో ఒకటైన ఈ బెల్ట్‌ను హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ కార్యదర్శి ఎం. సిద్ధార్థన్ పర్యవేక్షిస్తారు. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సి.టి. రవి ఆయనతో కలిసి పని చేస్తారు. ఈ జిల్లాల్లో చాలా కాలంగా తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.

**నబద్వీప్ -నార్త్ 24 పరగణాలు**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ కార్యదర్శి మధుకర్ నూకల ఈ ప్రాంతంలో కాషాయ పార్టీ ప్రచార బాధ్యతలు చూస్తారు. యూపీ మంత్రి సురేష్ రాణా సహ-ఇన్‌చార్జ్‌గా ఉంటారు. సరిహద్దు జిల్లా అయిన నార్త్ 24 పరగణాలను రాజకీయంగా వ్యూహాత్మక ప్రాంతంగా పరిగణిస్తారు. ఇక్కడ సంస్థాగతంగా బలపడాలని బీజేపీ భావిస్తోంది.

**ఉత్తర బెంగాల్ (మాల్దా-సిలిగురి డివిజన్)**

అరుణాచల్ ప్రదేశ్ బీజేపీ కార్యదర్శి అనంత్ నారాయణ్ మిశ్రాకు మాల్దా ప్రాంత పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన అరుణ్ బిన్నాడి.. సిలిగురి ప్రాంతం బాధ్యతలు నిర్వహిస్తారు. బీజేపీ సాంప్రదాయ మద్దతు స్థావరాలలో ఒకటిగా పరిగణించబడే ఉత్తర బెంగాల్ ప్రాంతం అంతటా మాజీ కేంద్ర మంత్రి కైలాష్ చౌదరి చురుకైన పర్యవేక్షక పాత్రను పోషించనున్నారు.

# డీజీసీఏ కీలక నిర్ణయం... పైలట్లు, సిబ్బందికి 'ఫాటిగ్ ట్రైనింగ్' తప్పనిసరి

విమాన భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పైలట్లు, క్యాబిన్ సిబ్బందితో పాటు విమాన షెడ్యూళ్లను ప్లాన్ చేసే సిబ్బందికి కూడా ఏటా ఫాటిగ్ మేనేజ్‌మెంట్‌పై (అలసట నిర్వహణ) శిక్షణను తప్పనిసరి చేసింది. ఇటీవల కాలంలో విమాన సిబ్బంది పని గంటలు పెరగడం, వారి అలసట భద్రతపై ప్రభావం చూపుతుందన్న ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ప్రతీ విమానయాన సంస్థ తమ రెగ్యులర్ గ్రౌండ్ ట్రైనింగ్‌లో భాగంగా ఏటా కనీసం ఒక గంట ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఇందులో విమాన ప్రయాణ గంటలు, డ్యూటీ పరిమితులు, తప్పనిసరి విశ్రాంతి నియమాలతో పాటు, నిద్రకు సంబంధించిన శాస్త్రీయ అంశాలు, శరీర గడియారాన్ని (బాడీ క్లాక్) ప్రభావితం చేసే అంశాలు, అలసట పనితీరుపై ఎలా ప్రభావం చూపుతుందనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. సిబ్బంది తమ అలసట గురించి ఫిర్యాదు చేసేందుకు పారదర్శకమైన వ్యవస్థను, వాటిని సమీక్షించి దిద్దుబాటు చర్యలు సూచించేందుకు ఒక స్వతంత్ర ఫాటిగ్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా డీజీసీఏ ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించింది. ఎంతమంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు, ఎన్ని అలసట ఫిర్యాదులు వచ్చాయి, వాటిలో ఎన్నింటిని స్వీకరించారు, ఎందుకు తిరస్కరించారు అనే వివరాలతో ప్రతీ మూడు నెలలకు ఒకసారి తమకు నివేదిక పంపాలని స్పష్టం చేసింది. గత జులైలో జరిపిన ఆడిట్‌లో కొన్ని విమానయాన సంస్థలు అలసటకు సంబంధించిన నిబంధనలను సరిగ్గా పాటించడం లేదని డీజీసీఏ గుర్తించింది. పైలట్ సంఘాలు కూడా రాత్రిపూట ల్యాండింగ్‌లు పెంచడం భద్రతకు ముప్పు అని హెచ్చరించాయి. గతంలో వారపు విశ్రాంతిని 48 గంటలకు పెంచుతూ డీజీసీఏ తీసుకున్న నిర్ణయాన్ని కొన్ని సంస్థలు వ్యతిరేకించినా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో అవి అమలయ్యాయి. ఈ నేపథ్యంలో, సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అలసట వల్ల తలెత్తే ముప్పును ముందుగానే నివారించే లక్ష్యంతో డీజీసీఏ ఈ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.



## భారతీయుల ఐక్యతతోనే భారతదేశ భవిష్యత్తు ఆధారపడి ఉన్నది..

**రాజ్యసభ సభ్యులు మొకారియా రాంబాయి మతాలు**



**కామారెడ్డి,నవంబర్25(సూర్యరేఖ)** భాషలకు అతీతంగా భారతీయులందరం ఒకే కుటుంబం అనే భావించే ఐకమత్యంతోనే భారతదేశ అభివృద్ధి మరియు భవిష్యత్తు ఆధారపడి ఉన్నదని గుజరాత్ రాష్ట్ర రాజ్యసభ సభ్యులు మొకారియా రామ్ భాయ్ వ్యాఖ్యానించారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఐక్యత మార్చ్ కార్యక్రమాల్లో భాగంగా కామారెడ్డి నగరంలో నిర్వహించిన ఐక్యత పాదయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విభిన్న రాజ్యాలుగా విడిపోయి ఉన్న భారతదేశాన్ని ఒక్కటిగా చేసి భారతదేశానికి ఒక మహోన్నతమైన రూపాన్ని ఇచ్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని,ప్రత్యేకంగా తెలంగాణ ప్రాంతం నిజాం యొక్క అరాచకాలలో నలిగిపోతున్న సమయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆనాటి హెూం మంత్రిగా ఆపరేషన్ పోలో నిర్వహించి మన ప్రాంతానికి స్వాతంత్రాన్ని ప్రసాదించాలని,అంతేకాకుండా భారత దేశంలో తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేసి శాశ్వతమైన స్వతంత్రాన్ని కల్పించాడని గుర్తు చేశారు. భారతదేశం ఎన్నో క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొని ఈరోజు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అవతరించడంలో ఆనాటి మహనీయుల పాత్ర ప్రశంసనీయమైనదని,అదే ఆదర్శాన్ని నేటి మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ కొనసాగిస్తున్నారని కొనియాడారు.వసుధైక కుటుంబం అనే భావనతో భారతీయులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందరూ బాగుండాలని కోరుకుంటారని,ఇలాంటి గొప్ప మనస్తత్వం కేవలం భారతీయులలో తప్ప ఇంకెక్కడా కనిపించదని అందుకే భారతీయులుగా పుట్టిన మనమందరం గర్వించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.ఈకార్యక్రమం స్వాగతం ఉపన్యాసం జిల్లా యువజన అధికారిని శైలి చేశారు.

## ఈ నెల 30న అఖిలపక్ష భేటీ



ఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశాలు మొత్తం 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ కాలంలో 15 సిట్టింగ్‌లు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో సమావేశాలు ఎటువంటి అంతరాయం లేకుండా జరగాలని భావించిన కేంద్రం.. నవంబర్ 30న అఖిలపక్ష సమావేశం నిర్వహిం చనుం ది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో జరిగే ఈ భేటీలో.. ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బిల్లులపై, చర్చకు వచ్చే ముఖ్య అంశాలపై, విపక్షాల సహకారం అవసరంపై చర్చించనుంది. అయితే త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం ఉందని తెలుస్తోంది. అందుకు 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని పార్ల మెంట్‌లో బలంగా లేవనెత్తి, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

## మేం సంపద కోసం అధికారంలోకి రాలేదు



తాము నిజాయితీగా ప్రభుత్వాన్ని నడుపుతున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. పంజాబ్ లోని ఆనంద్‌పూర్ సాహిబ్ లో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఇన్ని నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రజలు అడుగుతున్నారని, ప్రభుత్వ నిధులను పూర్తిగా ప్రజల కోసమే వినియోగిస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కానివ్వడంలేదని చెప్పారు. తాము గురు మహరాజ్ సాహిబ్ మార్గంలో నడుస్తున్నామని, తప్పుచేసి ఉంటే ఆయన తమను శిక్షిస్తారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చింది డబ్బు సంపాదించడం కోసం కాదని, మంచి పేరు సంపాదించడం కోసమని కేజ్రీవాల్ అన్నారు. తాము పెద్దపెద్ద బంగ్లాలు నిర్మించుకోవడం కోసం రాలేదని, గురు మహరాజ్ ఆశీర్వాదాల కోసం వచ్చామని తెలిపారు.

## కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పున మర్గం'(పునరావాసం నుంచి పునరుజ్జీవనం) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నారాయణ్‌పూర్ జిల్లాలో 28 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 19 మంది మహిళలు ఉండగా, అందరిపైనా కలిపి మొత్తం రూ. 89 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు.హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం, బస్తర్ పోలీసులు, స్థానిక యంత్రాంగం, భద్రతా దళాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి.

# మందమర్రి సింగరేణి సోలార్ ప్లాంట్ లో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు

రాష్ట్రంలోనే మొట్టమొదటిది
ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ప్రారంభానికి సిద్ధం
ఏడాదికి 90 లక్షల యూనిట్ల సోలార్ విద్యుత్ సద్వినియోగం
సింగరేణి సంస్థ చైర్మన్ ఎండీ ఎన్ బలరామ్






**మందమర్రి,నవంబర్25(సూర్యరేఖ)** పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా,బ్యాటరీలో నిలువ చేసుకొని,అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించనున్నారు.పునరుత్పాదక విద్యుత్తు పెంపుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు చేస్తున్న విశేషమైన కృషిలో భాగంగా సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియాలో గల తన 28 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ కు అనుబంధంగా ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ను ఇటీవల ఏర్పాటు చేసింది.ఇది ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన ప్రయోగాత్మక ప్లాంట్.దీనిని రెండు మూడు రోజుల్లో ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**బీఈఎస్ఎస్ ఎందుకు? ఉపయోగం ఏమిటి ?**

రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే తన ఏరియాల్లో 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది.ఇవి సమర్థంగా పనిచేస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి.ఈ విధంగా ఉత్పత్తి చేసే విద్యుత్తును తెలంగాణ ట్రాన్స్ కో గ్రిడ్ ద్వారా అనుసంధానం చేసి సరఫరా చేస్తున్నారు.అయితే సింగరేణిలో డిమాండ్ లేని సమయాల్లో ఉత్పత్తి అవుతున్న సోలార్ విద్యుత్ ను గ్రిడ్కు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతోంది.ఇలా మిగిలిపోయిన సోలార్ విద్యుత్తును పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా నిల్వ చేసి గరిష్ట విద్యుత్ వినియోగం ఉండే సమయంలో కంపెనీ అవసరాలకు వినియోగించడం జరుగుతుంది.సాంకేతికపరంగా బీఈఎస్ఎస్ అత్యాధునికమైన సోలార్ విద్యుత్తు నిల్వ మరియు పొదుపు వ్యవస్థగా పేర్కొనవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం వారు త్వరలో పెద్ద ఎత్తున సుమారు 250 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సంకల్పించిన నేపథ్యంలో మందమర్రిలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ఒక తొలి అడుగుగా భావించవచ్చు. సుమారు రూ.2.73 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ వలన సింగరేణి సంస్థ ఏడాదికి సుమారుగా వినియోగించబడని 9.1 లక్షల యూనిట్ల సోలార్ విద్యుత్తును సద్వినియోగం చేసుకుంటూ రూ.70 లక్షల వరకు ఆదా చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.రాష్ట్రంలో అనేక సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఉన్నప్పటికీ తొలిసారిగా బీఈఎస్ఎస్ ఏర్పాటు చేసే అవకాశం తమకు కల్పించినందుకు సింగరేణి సంస్థ చైర్మన్ ఎండీ ఎన్ బలరామ్,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు,ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణలకు కృతజ్ఞతలు తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో సింగరేణి వ్యాప్తంగా అనువైన చోట్ల ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

# గుడి మాది గుడి ఆస్తులు మావి అడగడానికి మీరెవరు...!

- మీరు ఇవ్వాళ ఉంటారు,రేపు పోతారు,మీకేంది నేను చెప్పేది
- నేను చెప్పిన మాటే ఆలయంలో చెల్లుతుంది
- ఒంటెద్దు పోకడతో ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ
- హుండీ లెక్కింపును బహిష్కరించి బయటకు వెళ్ళిపోయిన 10 మంది సభ్యులు






**మేడ్చల్,నవంబర్25(సూర్యరేఖ)** : గుడి మాది.. గుడిలో ఉన్న ఆస్తులు మావి..అడగడానికి మీరెవరు..గుడిలో నేను చెప్పిందే మాట..నా మాటే శాసనం అన్న విధంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి చైర్మన్ తాటకం నారాయణ శర్మ మాటతీరు,ప్రవర్తన ఉందని ఆలయ పదిమంది ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్తీకమాసం ముగింపు సందర్భంగా మంగళవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ “గుడి మాది..మీరెవ్వరు ? ఇవ్వాళ ఉంటరు రేపు పోతరు..! మా మాటే ఆలయంలో చెల్లుతుంది” అంటూ ట్రస్ట్ బోర్డు సభ్యులను ఉద్దేశించి అవమానకరంగా ప్రవర్తించారని సభ్యులు ఆరోపించారు.దీనిపై నిరసనగా 16 మంది సభ్యుల్లో 10 మంది హుండీ లెక్కింపును బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. అనంతరం పదిమంది సభ్యులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు మాట్లాడుతూ..కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలు అవినీతిపై ప్రశ్నించినందుకు చైర్మన్ తాటకం నారాయణ శర్మ అవమానకర వ్యాఖ్యలతో ఆలయ పవిత్రతకు భంగం కలిగించారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.వేలాది మంది భక్తుల వద్ద డబ్బులు వసూలు చేసి దొడ్డి దారిన అభిషేకాలు స్వామి వారి దర్శనాలు చేయించాడన్నారు. ఆలయ అభివృద్ధికి డొనేషన్ పేరుతో భారీ ఎత్తున నగదు సేకరించి ఆలయ ఆదాయానికి గండికొట్టాడని ఆరోపించారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధన అమ్మే వారితో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని భక్తులను మోసం చేస్తూ అధిక డబ్బులు వసూలు చేస్తూ ఆలయ ఈవోను బెదిరించి చైర్మన్ కు అనుకూలంగా తాను తీసుకున్న నిర్ణయాలను బలవంతంగా అమలు చేయిస్తున్నడన్నారు.వీఐపీ ప్రత్యేక దర్శనం పేరుతో అనుచిత అభిషేకాలు సన్మానాలు చేయించి సాధారణ భక్తులను అవమానించడని,డోనర్ల విరాళాలను అక్రమ మార్గంలో మళ్లించుకున్నారన్నారు.ఫౌండర్ ట్రస్టీ పేరుతో ప్రతిరోజు చైర్మన్ కుటుంబ సభ్యులు గంటల తరబడి ఉచిత అభిషేకాలు చేసుకోవడం వల్ల భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రసిద్ధ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిణిని నియమించాలని సభ్యులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కౌకుట్ల కృష్ణా రెడ్డి,రెడ్డబోయిన ప్రవీణ్ పోచబోయిన రాజు, మొరుగు ముత్యాలు,దుందిగళ్ల దుర్గాప్రసాద్ గౌడ్,సామల అమరేందర్,రాపోల్ల శంకరయ్య, జూపల్లి సాయిలు,పాముకుంట్ల ప్రభాకర్ గౌడ్, భోనగిరి సురేష్ యాదవ్ తదితరులు పేర్కొన్నారు.

# పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం

**19 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి..**
**అభినందించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం,నవంబర్25(సూర్య రేఖ)** పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.వివిధ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగన్నతి పొందిన 19 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందించారు.ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న 19 మంది పోలీసు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కలిపించారు. అందులో నలుగురు మహబూబాబాద్ జిల్లా,14 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు,ఒకరిని ఇతర విభాగానికి కేటాయిస్తు బదిలీ చేశారు.

## ఎక్కలదేవి బండ వద్ద విషాదం

**ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి..**
**కోమటిపల్లి గ్రామంలో విషాదం**






**రామాయంపేట,నవంబర్25(సూర్యరేఖ)** ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన రామాయంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కోమటిపల్లి గ్రామానికి చెందిన పల్లెపురాజు (34) తన భార్య భవానితో కలిసి ఎక్కలదేవి బండ వద్దకు కంకర నింపుకునేందుకు వెళ్లారు.కంకర నింపుకొని తిరిగి గ్రామం వైపు వస్తుండగా,రాజు నడుపుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ఘటనలో రాజుకు తీవ్రమైన రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని చూసిన భార్య భవాని విలపిస్తూ స్థానికులకు సమాచారం అందించింది. భవాని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.గ్రామంలో రాజు మృతిచెందిన వార్త తెలియగానే విషాదం నెలకొంది.

## మోడల్ పాఠశాలలో క్రీడలకు సముచిత స్థానం

**అట్టహాసంగా కొనసాగుతున్న క్రీడా పోటీలు**
**ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీం**



**మందమర్రి,నవంబర్25(సూర్యరేఖ)** మోడల్ పాఠశాలలో క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని,ఈ సంవత్సరం ఎంతో మంది విద్యార్థులు రాష్ట్ర,జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీం తెలిపారు.మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు పీఎం శ్రీ పాఠశాలల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీం అట్టహాసంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మొదటి రోజు పోటీలలో భాగంగా కబడ్డీ,కోకో,వాలీబాల్ పోటీలు నిర్వహించామని మిగతా క్రీడలను కూడా నిర్వహించి,క్రీడల్లో నైపుణ్యతను కనబరచి, ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిడి చిన్నక్క,అధ్యాపక బృందం,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం

**బీసీలకు రాజకీయ ఉనికిని కోల్పోయే ఉరితాడులాంటిదే జీవో 46**



**మంచిర్యాల,నవంబర్25(సూర్యరేఖ)** జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపు మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏబీ చౌరస్తాలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 22న జీవో నెంబర్ 46 తీసుకొచ్చిందని,ఈ జీవో బీసీలకు రాజకీయ ఉనికిని కోల్పోయే ఉరితాడులాంటిదని,ఈ పచ్చి బీసీ వ్యతిరేక జీవో రావడానికి ప్రధాన కారణం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర ఫలితం అని,ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం డిసిసి పదవులు అగ్రకులాల వారికే కట్టబెట్టడం జరిగిందని,బీసీ వ్యతిరేక జీవో 46 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మందమరి పట్టణ అధ్యక్షులు సకినాల శంకర్,ఎల్లన్న,ప్రభాకర్,గట్ల సారంగా పాణి,చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ నాగరికతకు ఈ జెండా పునర్జీవం: ప్రధాని మోదీ

అయోధ్య: అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఇవాళ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ధర్మ ధ్వజం కేవలం జెండా మాత్రమే కాదు అని, భారతీయ నాగరికతకు పునర్జీవంగా ఈ పతాకం నిలుస్తుందని అన్నారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంథాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు.

# అక్రమ నిర్మాణాలపై కూకట్‌పల్లి టౌన్ ప్లానింగ్ మౌనదీక్ష.?

ప్రజల్లో ఆగ్రహం,విమర్శల వెల్లువ.!

కూకట్‌పల్లి 24సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల వరద.. స్థానికులు గంభీరంగా ఆగ్రహం..

అక్రమ నిర్మాణలలో ఓల్డ్ బోయిన్‌పల్లి హాట్ స్పాట్ గా మారింది..

మల్లికార్జున కాలనీ,అబ్రార్ నగర్,అంజయ్యనగర్, సాయిసాగర్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో డబుల్/ట్రిపుల్ అంతస్తుల నిర్మాణలు..

టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనదక్షం.?..పర్యవేక్షణ సిబ్బంది ఆడింది ఆట పాడింది పాటనే..

మామూళ్ల వసూలకు లైన్ క్లియర్?..నిశ్శబ్ద అనుమతులు.?

హైడ్రా బుల్డోజర్ ఎప్పుడు.?అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు.!







**బోయిన్ పల్లి,నవంబర్25 (సూర్యరేఖ)** కూకట్‌పల్లి జోనల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం పని తీరు ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది.. అనుమతులు ఒకలా ఉన్నా నిర్మాణాలు మాత్రం మరో స్థాయిలో పెరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికుల నుంచి ఉత్కంఠగా వినిపిస్తున్నాయి..24 సర్కిల్ లో అక్రమ నిర్మాణాల వరద అధికారులు మాత్రం నిశ్శబ్దం? కూకట్‌పల్లి 24 సర్కిల్,ముఖ్యంగా ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రాంతంలో రోజురోజుకూ అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఇలాంటి నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం మౌనదక్ష వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్..
### అక్రమ నిర్మాణాల 'హాట్ స్పాట్'.!

మల్లికార్జునకాలనీ,అబ్రార్ నగర్,అంజయ్యనగర్, సాయిసాగర్ ఎన్‌క్లేవ్ ఈ ప్రాంతాల్లో అనుమతులు అసలుకే ఉండవు కానీ నిర్మాణాలలో మాత్రం డబుల్ ట్రిపుల్ గా ఎలా నిర్మిస్తున్నారని ప్రశ్నిస్తూ ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఒక్కసారి కూడా తొంగిచూడరు అంటూ స్థానికులు ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు..టౌన్ ప్లానింగ్ నైక్ ఇంజనీరింగ్ విభాగం,సిబ్బంది ఇక్కడికి రారు..పర్యవేక్షణ అసలుకే చేయరని స్థానికులు ఆగ్రహంతో ఆరోపిస్తున్నారు.. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ,సెక్షన్ అధికారులు,నైక్ ఇంజనీరింగ్ విభాగం,సిబ్బందితో లక్షల్లో.?వసూలు చేపిస్తూ,లైన్ క్లియర్‌లు చేస్తూ నిశ్శబ్ద అనుమతులు ఇలా ఏదో గోప్యంగా కారణంగానే అక్రమ నిర్మాణాలు ఎవరి అడ్డూ తిరుగులేకుండా సాగుతున్నాయని స్థానికులు ఆగ్రహంతో అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### కూకట్ పల్లి జీహెచ్‌ఎంసీ ఖజానాకు భారీ నష్టం?

అనుమతులు లేని అదనపు అంతస్తులు.సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు.అనధికార విస్తరణలు ఇవి పెరుగుతున్న కొద్దీ జీహెచ్‌ఎంసీకి భారీ రెవెన్యూ నష్టం జరుగుతోందని నిపుణులు అంటున్నారు..రాష్ట్రానికి ఖజానా లేదనిఅప్పుపుడుతలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,చెబుతున్నారు.కానీ ఒకసారి కూకట్‌పల్లి జోనల్ టౌన్ ప్లానింగ్ విభాగంపై నేరుగా దృష్టి పెడితే రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది.!అని స్థానికులు ఆగ్రహంతో చెబుతున్నారు.చూడాలి మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఖజానా పెంచడం కోసం హైడ్రా బుల్డోజర్ పంపిస్తారా.?కూకట్ పల్లి టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటా.? వేచి చూడాల్సిందే..

# నయా ట్రెండ్



- ప్రీ వెడ్డింగ్ షూట్లో వింత పోకడ
- తెరపైకి విదేశీ కల్చర్
- ఇద్దరి మధ్య జరిగే సన్నివేశాలు సమాజంలోకి
- పెడదారి పడుతున్న పెళ్లి తంతు

పెళ్లి అంటే గతంలో చుట్టాలు,బంధువులు,మిత్రులతో వారం రోజులు చేసేవారు.ఇంటిముందు కొబ్బరి ఆకులు పెద్ద పందిరి వేసి మామిడాకుల తొరణాలతో పంచని పందిరి కింద పెళ్లి జరిపేవారనేది ఒకప్పటి మాట.'నేడు' పెండ్లికి ముందు వధూవరుల ఫోటోషూట్ ఓ ట్రెండ్.అందుకోసం కాశ్మీర్ నుంచి స్విజర్లాండ్ వరకు ఎక్కడికైనా వెళ్లడానికి సిద్దంగా ఉంటున్నారు కాబోయే జంటలు.చేయి తిరిగిన ఫోటోగ్రాఫర్,అత్యాధునికమైన కెమెరా,స్వర్గాన్ని తలపించే లొకేషన్స్,ఇలా అన్నింటిలోనూ నయా టెండ్ ను ఫాలో అవుతున్నారు నూతన జంటలు.ప్రీ వెడ్డింగ్ షూట్లు కాస్త పబ్లిక్ షో గా మారుస్తున్నారు.

**చేగుంట,నవంబర్25 (సూర్యరేఖ):** మన సంస్కృతి సాంప్రదాయాలను పట్టించుకోకుండా విదేశీ కల్చర్ ను తెరపైకి తెస్తున్నారు.హల్దీ ఫంక్షన్ పేరుతో వెడ్డింగ్ పేరుతో చెరువులు,గట్టులు,నదులు,గుట్టలు,బురద కుంటలు చివరకు స్మశానంలో సైతం రకరకాల విన్యాసాలు చేస్తూ షూట్ చేస్తున్నారు.ప్రీ వెడ్డింగ్ పోస్ట్ వెడ్డింగ్ బేబీ బంప్ పేరుతో పెండ్లి తరువాత గోప్యంగా జరగవలసిన సన్నివేశాలు బహిరంగం చేస్తున్నారు.భార్యాభర్తల మధ్య సున్నితమైన అపురూప సన్నివేశాలు చిత్రీకరించి లైకుల కోసం సోషల్ మీడియా ప్లాంట్ ఫాంలోకి వదులుతున్నారు.ప్రపంచంలోలోనే ఎంతో గొప్పగా చెప్పుకునే భారతీయ వివాహ వ్యవస్థ అభాసుపాలవుతున్న తీరు ఆందోళన కలిగిస్తుంది. వివాహం అనేది మనిషి జీవితంలో మరుపురాని మధుర ఘట్టం.పెళ్లి పుస్తకంలో ప్రతి పేజీ అందులో ప్రతి అక్షరం ఎంతో అపురూపం అనడంలో సందేహం లేదు.ప్రతి మనిషి జీవితంలో పెళ్లి అనేది ముఖ్యమైన అపురూప మైన వేడుక. పెళ్లిలో వధూవరులు జిలకర బెల్లం పెట్టినప్పుడు ఒకరినొకరు కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడడం భౌతిక స్పర్శతో నేడు ట్రేడింగ్ గా చెప్పుకుంటు న్నారు.దీంతోనే కెమిస్ట్రీకి నాడు అక్కడ ఆజ్యం పడుతుంది. సర్వకాల సర్వవ్యవస్థలో ఆమోదయోగిత కలిగిన అంతటి గొప్ప నిత్య నూతనమైన సనాతన భారతీయ జీవన విధానం నేడు దారితప్పుతుంది. ఆధునిక పేరుతో



అరాచకాలకు దారితీస్తుంది.వివాహ సందర్భంలో ముఖ్యమైన ఘట్టాలలో మంగళ స్థానానికి ఉన్న ప్రాముఖ్యత వేరు.ఈ వేడుకలలో వధూవరులకు పసుపు రుద్ది స్నానం చేయించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ కార్యక్రమాన్ని ఈ మధ్యకాలంలో హల్దీ ఫంక్షన్ పేరుతో వరుడికి బీరుతో స్నానాలు చేయించడం చిత్రవిచిత్రమైన పాటలపై నృత్యాలు బెల్లీ డాన్స్ లతో అరాచకానికి తెరతీస్తున్నారు.పెళ్లి వేడుకలు ఏండ్లపాటు గుర్తుండేలా చేసుకోవాలని చిత్ర విచిత్ర విన్యాసాలు చేస్తున్నారు.వివాహ వేడుకలకు ముందుగా జరిపే మంగళ స్నానం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు.అలాంటి కార్యక్రమాన్ని డాన్సులు విన్యాసాలు చేస్తూ నానా యాగి చేస్తుండడం పట్ల సాంప్రదాయ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మంగళ స్నానానికి ముందు గులాబీ పూల రెక్కలను శుభ్రమైన నీటిలో వేసి కొన్ని గంటల సేపు ఉంచుతారు.ఇక పసుపు లేకుండా ఎలాంటి శుభకార్యాలు కూడా జరగవు అన్న సంగతి తెలిసిందే. హిందూ సాంప్రదాయ ప్రకారం పసుపు అనేది శుభానికి గుర్తు అని మంగళ స్నానంలో భాగంగా వెన్నతో కలిపిన పసుపు చందనం బాగా మర్థిస్తారు.ఆ తరువాత శనగపిండితో మృదువుగా రుద్దుకున్నాక స్నానం చేయిస్తారు.ఇలా చేయడం వలన వధూవరులు మరింత ప్రకాశవంతంగా కనిపిస్తారని కనిపిస్తారన్న ఉద్దేశంతో వారికి పసుపును రాసి స్థానాలు చేయిస్తారు.అంతేకా కుండా అదే నీళ్లలో కొంచెం పన్నీరు కూడా కలిపినట్లయితే చర్మం కాంతిగాను,మృదువుగాను,సువాసనలు వెదజల్లుతూ ఉంటుందట.దీంతో పెళ్లిలో వధూవరులు మరింత ప్రకాశవంతంగా కనిపిస్తారని మంగళస్నానం లో ఉన్న పరమార్థం.అలాంటి సాంప్రదాయాన్ని విడిచిపెట్టి ప్రీ వెడ్డింగ్ పేరుతో వింతలో విన్యాసాలు చోటు చేసుకుంటున్నాయి.నూతన దంపతులు భారీగా ఖర్చు చేసేందుకు ఏ మాత్రం వెనుకాడం లేదు.పెళ్లి అవుతునంత సేపు పెళ్ళికి ముందు తీసిన చిత్రాలను పెళ్లి ముందు తెరపెట్టి చూపిస్తున్నా రు.నాలుగు గోడల మధ్య జరగవలసిన దృశ్యాలను కలిపి చూపించడంతో సాంప్రదాయమైన కుటుంబాలు పెదవి విరుస్తున్నారు.నగరాలలో ఉండే ఈ ట్రెండ్ నేడు పట్టణాలు దాటి గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది.ఇలాంటి చిల్లర చేష్టలతో ప్రపంచంలోనే ఎంతో గొప్పగా చెప్పుకునే మన వివాహ వ్యవస్థ అభాసపాలు కాకుండా నూతన దంపతులు తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని సాంప్రదాయవాదులు కోరుతున్నారు.

# ఖమ్మం జిల్లాశాఖ తలపెట్టిన 30 గం.ల నిరాహార దీక్ష సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరణ



**ఖమ్మం,నవంబర్25 (సూర్యరేఖ)** ఈనెల 27,28 తేదీలలో పిఆర్టియుటిఎస్, ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలపై పిఆర్టియు టీఎస్ ఖమ్మం జిల్లాశాఖ తలపెట్టిన 30 గం.ల నిరాహార దీక్ష కార్యక్రమానికి సంబందించిన కరపత్రాలను కల్లూరు మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించడం జరిగినది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిఆర్ టియుటిఎస్,కల్లూరు మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాకాల రమేష్,షేక్ చాంద్ సాహెబ్,లు మాట్లాడుతూ...ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావలసిన జిపిఎఫ్ టిఎస్జిఎల్ఐ సరెండర్ లీవ్,మెడికల్ రీయంబర్స్మెంట్ తదితర బిల్లులకు సంబంధించిన సొమ్మును సంవత్సరాల తరబడి జమ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 27,28 తేదిలలో ఖమ్మం జిల్లాశాఖ చేపట్టే నిరాహార దీక్షలో ఉపాధ్యాయులందరూ సాధ్యమైనది. ఎక్కువమంది పాల్గొని జయప్రదం చేయగలరని కోరారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియుటి ఎస్,రాష్ట్ర భాద్యులు ఎండి.మౌలాని,పఠాన్ రహీం,జిల్లా భాద్యులు డి.కమలాకర్ రెడ్డి,ఎం. కృష్ణారావు కల్లూరు,పెనుబల్లి,తల్లాడ,ఏన్కూర్ మండలాల భాద్యులు,పిఆర్టియుటిఎస్ సంఘ సభ్యులు అభిమానులు పాల్గొనడం జరిగినది.

## ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్..




**నిజాంపేట,నవంబర్25(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆరోగ్యం దాని యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి విద్యార్థులందరూ మన తెలంగాణలోని లభించే వివిధ రకాల గుడాలు మిల్లెట్స్ (చిరుధాన్యాలు)తో చేసిన ఆహార పదార్థాలు మొదలగు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను పాఠశాల తీసుకొని వచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**



**నాగల్ గిద్ద,నవంబర్25(సూర్య రేఖ):** అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని ఔదాపూర్ ముక్తాపూర్ కారా ముంగి ఎస్గి. వల్లూర్ గ్రామాలలో పలుఅభివృద్ధి పనులకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో గ్రామాలు అభివృద్ధికి ఏ మాత్రం నోచుకోలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు.అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ఇందిర మహిళ శక్తి చీరలను స్వయం సహాయక మహిళ సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ పీఏస్సీ ఎస్సీ చైర్మన్ మాణిక్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సచిన్ పటేల్,మాజీ ఎంపీటీసీ పండరినాథ్రావు పటేల్,మాజీ సర్పంచులు విట్టల్ రావు పటేల్,సంజీవ్ పటేల్, అనిత గుండె రావు,అంబాజీ సంతోష్ అనిల్ పాటిల్,నాయకులు రహీం,మోహన్ రెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ





**నారాయణపేట జిల్లా ప్రతినిధి,నవంబర్25 (సూర్యరేఖ)** మరికల్ మండల కేంద్రంలోని సూర్య చంద్రఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ చేపట్టిన మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామి రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్లు వినీతమ్మ రామచంద్రయ్య, అధికారులు ఎంపీ డీవో ఎమ్మార్వో పార్టీనాయకులు కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మదన్మోహన్ శంకుస్థాపన



**కామారెడ్డి,నవంబర్25(సూర్యరేఖ)** సదాశివనగర్ పట్టణంలోని ఎస్సీకాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మదన్మోహన్ ప్రారంభించారు.ఈ ప్రాంతంలో రోడ్లు,డ్రెయిన్లు ఏర్పాటు కావడం చాలా సంవత్సరాలుగా పెండింగ్లో ఉండటంతో,స్థానిక ప్రజలు పలు సందర్భాల్లో ఈ సమస్యను ప్రస్తావించారు. ప్రజల ఆవశ్యకతను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి రూ.25 లక్షల నిధులను మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేసారు.అదేవిధంగా,సదాశివనగర్ పట్టణంలో 80 ఇంద్రమ్మ ఇళ్ల కూడా మంజూరు చేయబడి ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు.గతంలో నిర్వహించిన 'గడప గడపకు మదన్ అన్న' కార్యక్రమంలో ప్రజలకు ఇంద్రమ్మఇళ్లు కల్పిస్తానని ఇచ్చిన హామీని అమలు చేస్తూ,ప్రస్తుతం ఆ పనులు వాస్తవ రూపం దాల్చుతున్నాయి.స్థానికులు హైమ్యాక్స్ లైట్లు మరియు ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కూడా కోరగా,ఎమ్మెల్యే మదన్మోహన్ రూ. 5 లక్షల నిధులు కమ్యూనిటీ హాల్ కోసం మంజూరు చేస్తామని,అలాగే హైమ్యాక్స్ లైట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రయత్నాలతో తమ ప్రాంత అభివృద్ధి కోసం కీలక నిర్ణయాలు తీసుకుని,పనులు ప్రారంభించినందుకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, మదన్మోహన్ కి కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజల కష్టసుఖాలు నెరవేరుస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే మదన్ కు ప్రత్యేక అభినందనలు గ్రామస్తులు తెలిపారు

# నియోజకవర్గంలోని అన్ని కాలనీల అభివృద్ధికి పెద్దపీట

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్,నవంబర్25(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.కాలనీల అభివృద్ధినే లక్ష్యంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి కృషితో ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లుగా తెలిపారు.ఉప్పల్ డివిజన్ లోని దేవేందర్ నగర్ లో కార్పొరేటర్ రజితాపరమేశ్వ ర్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలో అభివృద్ధి పనులను చేపడుతూ సమస్యలను పరిష్కరిస్తునట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అలీమ్ కనయ్య కుమ్మరి రాజు పులిరాజు సత్యనారాయణ సందీప్, భాస్కర్,బ్రహ్మంచార్రీ, మధు,స్వామి శంకర్ ప్రవీణ్ శ్రీధర్ పుల్లమ్మ జయ రెడ్డి,సునీత వాసు ఎల్లేష్,గణేష్, లత ఉమా స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ప్రతి ఒక్క ఉద్యోగికి అనివార్యం..

**జీఎం ఎన్.రాధాకృష్ణ**

**మందమర్రి,నవంబర్ 24(సూర్యరేఖ)**పదవీ విరమణ అనేది ప్రతి ఒక్క ఉద్యోగికి అనివార్యమని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు.సోమవారం ఏరియాను సందర్శించిన జీఎం చీఫ్ సెక్యూరిటీ లక్ష్మీనారాయణకు జీఎం ఎన్.రాధాకృష్ణ మొక్కను అందచేసి స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ...సింగరేణికి సుదీర్ఘకాలం పాటు సేవలు అందించి ఈనెల పదవీ విరమణ పొందబోతున్న సందర్భంగా వారు సింగరేణికి చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం లలితేంద్ర ప్రసాద్,డీజీఎం పర్సనల్ అశోక్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సీనియర్ సెక్యూరిటీ అధికారి రవి,డివైపిఎం ఆసిఫ్,సీనియర్ పర్సనల్ అధికారి సందీప్,కార్తీక్,సత్యనారాయణ, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## డబల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించిన హౌసింగ్ పిడి మాణిక్యం..



**నిజాంపేట,నవంబర్25(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ,కల్వకుంట గ్రామాలలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంగళవారం హౌసింగ్ పీడీ మాణిక్యం పరిశీలించడం జరిగింది.డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి చాలా రోజులవుతున్నందున తలుపులు కిటికీలు దెబ్బతిన్నాయి.వాటిని రిపేర్ చేయించి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్,మండల పంచాయతీ అధికారి వెంకటనర్సింహ రెడ్డి,హౌసింగ్ ఏఈ సంధ్య, కార్యదర్శి రాములు, పాల్గొన్నారు.

## వెంకటపూర్(కె)చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం..




**నిజాంపేట,నవంబర్25(సూర్యరేఖ)** మండల పరిధిలోని వెంకటాపూర్ (కె)గ్రామ పంచాయతీలో మంగళవారం గ్రామసభ నిర్వహించి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది.దీనిలో భాగంగా విజన్ ఎన్జీవో కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ సంజీవ్,గ్రామ ప్రత్యేక అధికారి రమ్య శ్రీ, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రేమ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న,అంగన్వాడీ టీచర్లు అరుణ,యశోద, ఏఎన్ఎంఅర్చన,ఆశా వర్కర్ కవిత,ఫీల్డ్ అసిస్టెంట్ కైలాష్,పాల్గొన్నారు.

## పుట్టగొడుగుల వెలుస్తున్న బేకరీలు..అటువైపు చూడని ఫుడ్ సేఫ్టీ అధికారులు



**కామారెడ్డి,నవంబర్25(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలో బేకరీలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి పలు బేకరీలలో కాలం చెల్లిన క్రీమ్స్ వాడుతు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారుఆహార పదార్థాలలో మోతాదుకు మించి కలర్స్ వేసి కేకులు తయారు చేస్తున్నారు ఈ కేకులు తిన్నవారు అనారోగ్య పాలే ఆసుపత్రి పాలవుతున్నారు.ఇంత తథాంగం జరుగుతున్న సేఫ్టీ అధికారులు మాత్రం తనిఖీలు చేపట్టిన ఘటనలు జిల్లా కేంద్రంలో లేవు.జిల్లా కేంద్రంలోని కొన్ని బేకరీలలో ఆహార భద్రత ప్రమాణాలు పాటించడం లేదని,అపరిశుభ్రత వాతావరణంలో కేకులు తయారు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.బేకరీ ఆహార ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి పెట్టాలని,జాగ్రత్తగా ఉండాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరికలు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కామారెడ్డి జిల్లా ప్రజలు కోరుతున్నారు నాణ్యతలేని పదార్థాల వాడకంపై,కాలం చెల్లిన ముడి సరుకులతో కేకులు తయారుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు ఇప్పటికైనా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు బేకరీలను తనిఖీలు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కామారెడ్డి ప్రజలు కోరుతున్నారు.

# జన సమితి నేత కోదండరామ్ ను కలిసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్





**హైదరాబాద్,నవంబర్ 25(సూర్యరేఖ)** జూబ్లీహిల్స్ శాసనసభ్యుడిగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామను మర్యాదపూర్వకంగా కలిశారు.నాంపల్లి టీజేఎస్ కార్యాలయంలో కోదండరాంను కలిసి జూబ్లీహిల్స్ ఎన్నికలలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా నవీన్ యాదవ్ ను కోదండరాం శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.అనంతరం మీడియాతో కోదండరాం మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనకు ప్రజలు ఆమోదం తెలిపారని,నగరంలో అంజయ్య, వెంకటస్వామి,పిజెఆర్ నేతల తరహాలో నూతనంగా ఎన్నికైన నవీన్ యాదవ్ పేద, బడుగు బలహీన వర్గాల కోసం పనిచేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ... తన గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని,జూబ్లీహిల్స్ లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.నరసయ్య మాట్లాడుతూ...నవీన్ యాదవ్ గెలుపులో కీలకపాత్ర పోషించిన ప్రతి ఒక్కరికి తెలంగాణ జన సమితి కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు పల్లె వినయం నిచ్చెన రమేష్,గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రామచంద్ర, బీసీ సెల్ అధ్యక్షుడు జస్వంత్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ కార్యాలయం ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి,నగర నాయకులు గోవింద్,రమేష్, సయ్యద్ ఇస్మాయిల్ జైపాల్ రెడ్డి,రసూల్,పాషా, కన్నయ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ధారసత్యం, తన కార్యదర్శి కొత్త రవి,తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణకాలనీలో ఉప్పల్ బిజెపి అధ్యక్షులు మార్నేని ఫణిందర్ ఆధ్వర్యంలో బస్తీ బాట





**ఉప్పల్,నవంబర్25(సూర్యరేఖ)** బస్తీబాట కార్య క్రమంలో భాగంగా మంగళవారం లక్ష్మీనారాయణ కాలనీలో సోమవారం ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు మార్నిని ఫణిందర్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు.వీధి నెంబర్ 20,24లో కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఉప్పల్ బిజెపి అధ్యక్షులు మార్నేని ఫణిందర్ మాట్లాడుతూ...డివిజన్ పరిధిలోని ప్రజలు తన దృష్టికి తీసుకు వస్తున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయాకాలనీలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.అధికారులు సమస్యలను తెలిపిన వెంటనే స్పందిస్తూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏ.డి.ఈ.రవీందర్,ఏఈ.లైన్ మెన్,బీజేపీడివిజన్ ఉపాధ్యక్షులు బసవ రాజు ,బీజేపీ సీనియర్ నాయకులు బొడ్డు రవీందర్,రఘు,నర్సింహా,కాలనీ వాసులు పాల్గొన్నారు.


### ఇందిరమ్మ చీరల పంపిణీ..



**నిజాంపేట,నవంబర్25(సూర్యరేఖ)**మండల కేంద్రంతోపాటు నగరం గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రూప్ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న చీరలను మహిళా గ్రూపులో లేని మహిళలందరికీ అందిస్తున్నామన్నా రు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హరీఫ్ హుస్సేన్,మహిళ సంఘం సభ్యులు నందిని,భాగ్యలక్ష్మి,వర్ష, లాస్య,శ్రీమతి రజిత,కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ దేవేందర్,రవి, సురేష్ మెహన్ గ్రామ మహిళలు ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుకా మాతా అభిషేకం






**కొల్చారం,నవంబర్25(సూర్యరేఖ)** ఆదిశక్తి పరాశక్తి రేణుకా ఎల్లమ్మను దర్శించుకుంటే అన్ని శుభాలే కలుగుతాయని కాముగారి శ్రీకాంత్ గౌడ్ శ్రీజ(శిరీష)కుటుంబ సభ్యులు అన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీరేణుక ఎల్లమ్మ 5వ వార్షికోత్సవం ఆనంతరం 27వ మంగళవారం మంగళపర్తి గ్రామానికి చెందిన శ్రీకాంత్ గౌడ్ శ్రీజ (శిరీష)కుటుంబ సభ్యులచే శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక అలంకరణ అర్చన కార్యక్రమం నిర్వహించగా ఆలయ అర్చకులు బస్వరాజ్ శర్మ మంత్రో చ్ఛహరణల మధ్య ఘనంగా జరిపారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణగౌడ్,కిరణ్ గౌడ్,భరత్ గౌడ్,శరత్,సురేష్ గౌడ్,సత్యనారాయణ నర్సిములుగౌడ్ శేఖర్ గౌడ్, సుధాకర్ గౌడ్,నారాయణ గౌడ్,రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు భోజగుట్ట,రెడ్ హిల్స్ తో పాటు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం..

**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్ 25(సూర్యరేఖ)** నగరానికి తాగునీటిని అందించే కృష్ణ ఫేజ్ 1వ,2వ,3వ పంపింగ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేసే ఫీడర్లు,ట్రాన్స్ ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చనున్నాన్న సందర్భంగా బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం4గంటల వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.భోజగుట్ట,రెడ్ హిల్స్ తో పాటు చార్మినార్ వినయ్నగర్ నారాయణగూడ ఎస్సార్ నగర్,హయత్ నగర్,ఉప్పల్,రాజేంద్రనగర్,మీర్ పేట్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ప్రభావం చూపనుందని అధికారులు పేర్కొన్నారు.



### తాత్కాలిక మరమ్మత్తులు షురూ..



**నిజాంపేట,నవంబర్25(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని మల్కాచెరువు మత్తడి వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో కాంట్రాక్టర్ తాత్కాలిక మరమ్మత్తులు ప్రారంభించారు. ప్రత్యామ్నాయంగా కూలిపోయిన పిల్లర్‌ను పునర్నిర్మిస్తున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు వెళ్లకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని, వాహనదారులు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని కోరారు.

### గొర్రెల కాపరి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించిన టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి




**కామారెడ్డి,నవంబర్25(సూర్యరేఖ)** గత రెండు రోజుల క్రితం గొర్రెల కాపరి సుధాకర్ చనిపోగా విషయం తెలుసుకున్న టీపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి గొర్రెల కాపరి సుధాకర్ కుటుంబానికి పరమర్శించారు.ఈ సందర్భంగా రూ.20వేలు వారి కుటుంబానికి అందజేశారు.టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...బాధ్యత కుటుంబానికి చదువుకోడానికి పిల్లలకు నా వంతు సహాయ సహకారాలు చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్,మామిళ్ళ అంజయ్య,నిమ్మ విజయ్ రెడ్డి,వీరన్న పటేల్,తాజా మాజీ కౌన్సిలర్లు,ఊర్దొండ రవి,చాట్ల వంశీ,పంపరి శ్రీనివాస్,రావు,గడ్డమీది మహేష్,మామిల్ల రమేష్,రంగ రమేష్,నవీన్,రవి పటేల్,యూత్ నాయకులు,ఆబిద్,ఇమ్రాన్,బల్ల శ్రీనివాస్,కిరణ్, నర్సుల మహేష్,మున్నా,శశి,శ్రీకాంత్,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### బెల్లంపల్లి మహిళా శక్తి జాగరణ

**కోటి మహిళల ఎదుగుదలకు కాంగ్రెస్ ప్రభుత్వ మహొన్నత సంకల్పం**

**ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చేతుల మీదుగా వడ్డీరహిత రుణాల పంపిణీ**








**బెల్లంపల్లి,నవంబర్25(సూర్య రేఖ)** బెల్లంపల్లి మండలంలోని కన్నల రైతు వేదికలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన మహిళ ఉన్నతి–తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్లు 31 లక్షలు 12 వేల విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చేతుల మీదుగా మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు.ఈ చెక్కులు బెల్లంపల్లి,కన్నల రామాజిగూడెం,సాంపల్లె తదితర గ్రామాల మహిళా స్వయం సహాయక సంఘాలకు కేటాయించబడ్డాయి.ప్రతి సంఘం తమ సభ్యుల అభివృద్ధి కోసం ఈ మొత్తాన్ని వినియోగించుకోనుంది.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్,జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు,మహిళా సంఘాల నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ..మహిళలే కుటుంబ బలం,కుటుంబమే సమాజ బలం.మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మా ప్రభుత్వం అనేక శ్రేయోభిలాషి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళల ప్రోత్సాహక చర్యలు...మహిళా సంఘాలకు ప్రయాణ వాహనాల కేటాయింపు చిన్న వ్యాపారాలు,సేవా కేంద్రాలు,కొత్త పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కుటుంబ ఆదాయాన్ని పెంచే పథకాలకు ప్రాధాన్యత బెల్లంపల్లి నియోజకవర్గంలోని ప్రతి మహిళా సంఘం ఎదగాలి,ప్రభుత్వం అందించే ప్రతి పథకం మహిళల దాకా చేరేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్ అధికారులు మహిళా సంఘాల సభ్యులు కాంగ్రెస్ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా గుర్రం రాఘవేందర్ నియామకం

**ఉప్పల్,నవంబర్25(సూర్యరేఖ)** గ్రేటర్ హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా రామంతపూర్ కు చెందిన గుర్రం రాఘవేందర్ ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మంగళవారం ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రాన్ని రాఘవేందర్ కు అందజేశారు. కార్యదర్శిగా నియమితులైన గుర్రం రాఘవేందర్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి గ్రేటర్ కార్యదర్శిగా నియమించిన ఆర్.కృష్ణయ్యకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు, రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించే వరకు బీసీలు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించే విషయంలో కొన్ని పార్టీలు డ్రామాలు



ఆడుతున్నాయని,బీసీల రిజర్వేషన్ల విషయంలో ఆ పార్టీలకు చిత్తశుద్ది లేదని విమర్శించారు. రాజ్యాంగంలో పదిశాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేసిన నాయకులు,బీసీ రిజర్వేషన్లను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్రంలోని అగ్రవర్ణ పాలకులు తాము ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లను



రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చి, రాష్ట్రపతి ఆమోదంతో గ్యారంటీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాజకీయ పార్టీలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# టీపీసీసీ చీఫ్ ను కలిసిన డిసిసి నూతన అధ్యక్షులు వజ్రేష్ యాదవ్





**ఉప్పల్,నవంబర్25 (సూర్యరేఖ)** మేడ్చల్ జిల్లా నూతనంగా నియమితులైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మంగళవారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ శు భాకాంక్షలు తెలిపారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలపర్చేందుకు కృషి చేయాలని,ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతం కోసం కఠినంగా శ్రమించాలని సూచించారు. అదే విధంగా2029లో రాహుల్ గాంధీ గారిని దేశ ప్రధానమంత్రిగా చూడాలంటే ప్రతీ కార్యకర్తను చైతన్యవంతం చేస్తూ,సమిష్టిగా కష్టపడి పనిచేయాలని వజ్రేష్ యాదవ్ ని మహేష్ గౌడ్ కోరారు. జిల్లా కాంగ్రెస్ కమిటీకి కొత్త ఉత్సాహం, నూతన దిశ అందించాలని తన సంపూర్ణ సహకారం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి,టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సరెడ్డి బూపతిరెడ్డి పాల్గొన్నారు.

# ఆరు నెలల నుండి జీతాలు రాకపోతే కార్మికులు ఎలా బతకాలి

**ఎమ్మెల్యేలు,ఎంపీలు జీతాలు తీసుకోకుండా ఉంటున్నారా.?**
**ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు**

**ఖమ్మం,నవంబర్25(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కల్లూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను ఆయన నేరుగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే కార్మికుల ఇల్లు ఎలా గడవాలన్నారు. చిరు ఉద్యోగులైన వీరికి వచ్చేది చిన్న జీతాలని,ఆ చిన్న జీతాలను సైతం నెలలు తరబడి చెల్లించకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న, వీరి జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఆరు నెలల కాలంలో వంటనూనె రేటు మూడుసార్లు పెరిగింది అన్నారు. ఇకపోతే ఆరు సంవత్సరాల కాలంలో రెట్టింపు రేటుతో ప్రస్తుతం 156 రూపాయలుగా ఉందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతుంటే కార్మికుల జీతా



లు మాత్రం రోజురోజుకి కోతల విధింపబడుతున్నాయన్నారు.. ఈరకమైన పరిస్థితులు ఏర్పడితే రాబోయే రోజుల్లో దారిద్రరేఖకు దిగువున ఉండే కార్మికుల సంఖ్య రెట్టింపు అవుతుందని ఆయన ఈ సందర్భంగా వాపోయారు. ఎంపీలు,ఎమ్మెల్యేలు నెలలు తరబడి జీతాలు తీసుకోవడం లేదా అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కల్లూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు జిల్లా సమితి సభ్యులు దామాల దయాకర్ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాప్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా ఉపాధ్యక్షులు ఓడల కృష్ణమూర్తి,సహాయ కార్యదర్శి ఎండి వజీర్ మియా జిల్లా సమితి సభ్యులు మోదుగు సీతమ్మ, గొల్లమందల యశోద,జీనుగు మణిరాజ్ చిన్న అంజలి,సుధాకర్,ప్రకాష్,కట్ట నరసింహారావు, లక్కినేని ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు సొంత నిధులతో చంద్రన్న భరోసా..

**ఉచిత ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్ల పంపిణీ చేసిన**
**టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి.**

**కామారెడ్డి,నవంబర్25 (సూర్యరేఖ)** కామారెడ్డి పట్టణంలోని కామారెడ్డి నియోజకవర్గ చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన ప్రేమలత వికలాంగురాలకు మంగళవారం చంద్రన్న భరోసా ఉచిత ఎలక్ట్రికల్ ట్రైసైకిల్,ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ పేద ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో,మాజీ మున్సిపల్ చైర్మన్,మామిళ్ళ అంజయ్య, నిమ్మ విజయ్ రెడ్డి తాజా మాజీ కౌన్సిలర్లు,ఊర్దొండ రవి,చిన్న మల్లారెడ్డి మాజీ సర్పంచ్ ఆనంద్ రావు,హనుమాన్ల గంగయ్య, రాముకుమార్ చాట్ల వంశీ,పంపరి శ్రీనివాస్,పిడుగు మమత సాయిబాబా,శంకర్ రావు గడ్డమీది మహేష్, మామిల్ల రమేష్,రవిపటేల్,రంగ రమేష్,నవీన్,యూత్ నాయకులు



ఆబిద్, ఇమ్రాన్,బల్ల శ్రీనివాస్,కిరణ్,నర్సుల మహేష్, మున్నా శశి శ్రీకాంత్,హైమద్,తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్ లో ఘనంగా అయ్యప్ప స్వామి 14వ మహాపడిపూజ..



**ఉప్పల్,నవంబర్25(సూర్యరేఖ)** రామంతపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తవిడబోయిన గిరిబాబు గురుస్వామి రామంతపూర్ ఆఫీస్ లో అయ్యప్ప స్వామి 14వ మహాపడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రామంతపూర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ తవిడబోయిన సౌమ్య,ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి,గడ్డం రవికుమార్, బరంపేట కృష్ణముదిరాజ్,ఉప్పల్ ఏ బ్లాక్ జనరల్ సెక్రెటరీ మురళిగౌడ్,గాయం శ్రీధర్ రెడ్డి,బిక్షపతిచారి, తెలంగాణ గంగపుత్ర సంఘం అధ్యక్షులు దివిటి మల్లయ్య,గణేష్ చారి గురుస్వామి వంగాల సతీష్, ఆకుల సంధ్యారాణి,మేఘనాథ్,వెంపటి సత్తయ్య, పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు పూజలో పాల్గొన్నారు.

## ఆటో బోల్తా..ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు



**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్25(సూర్యరేఖ)** గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని తారామతి సమీపంలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం..ప్రమాద సమయంలో ఆటో డ్రైవర్ ఫోన్లో మాట్లాడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఆటో డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ కారును ఢీకొనడంతో ఆటో రిక్షా బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు పాక్షికంగా డెబ్బ తిందని కారు డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేసారు. ఘటనపై గోల్కొండ పోలీస్ లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రజల సమస్యల పరిష్కారంపై ఎంత దూరమైన వెళ్తా..

**వందేమాతర గీతం గీతాలాపనకు మజ్లీస్ సభ్యులు మతం రంగు..**
**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్,నవంబర్25(సూర్యరేఖ)** ప్రజల సమస్యల పరిష్కారంపై తాను ఎంతదూరమైనా వెళ్తానని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గ్రేటర్ జిహెచ్ఎంసి కార్యాలయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ మీటింగ్ లో ఆయన బీజేపీ కార్పొరేటర్లు,సహచర కార్పొరేటర్లతో కలసి గళం వినిపించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహానగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన సత్వర చర్యలు తీసుకోవాలని బీజేపీ పార్టీ తరపున డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మహా నగరం చాలా సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందుకు ఎదుర్కొంటున్నారని,వెంటనే ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ ను కోరారు. అనంతరం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద మెదక్ పార్లమెంట్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...వందేమాతర గీతం గీతాలాపన 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మేయర్ దానికి ఒప్పుకున్నారు. కాంగ్రెస్,బీఆర్ఎస్,లు సైతం ఒప్పుకున్నారు. మజ్లీస్ పార్టీ సభ్యులు కనీసం గౌరవం లేకుండా వారు కుర్చీలో లేవలేదన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం వందేమాతరం ఉద్యమం చేసి నినాదం ఇస్తే కులం,మతం,ప్రాంతం చూడకుండా,ఉద్యమం చేశారని గుర్తు చేశారు. కానీ మజ్లీస్ సభ్యులు దానికి మతం రంగు పూస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని మేయర్ ను కోరారు.

# ప్రీమెట్రిక్ స్కాలర్షిప్ ల కోసం మైఏస్సీ,ఏస్టీ,బి.సి విద్యార్థుల వివరాలు డిసెంబర్15 నాటికి పోర్టల్లో నమోదు చేయాలి

దేవర వంశీ.

**నాంపల్లి,హైద్రాబాద్,నవంబర్25(సూర్యరేఖ)** హైద్రాబాద్ జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నటు వంటి విద్యార్థుల వివరాలను డిసెంబర్15లోపు సమర్పించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారని భారతీయ జనతా పార్టీ యువనాయకుడు,సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ పేర్కొన్నారు.మంగళవారం నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవర వంశీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు వారంలోపు అందజేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారని,డిసెంబర్15 నాటికి చివరి తేదీ యని,విద్యార్థులకు సంబంధించిన కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు అందజేయడంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని రెవెన్యూ,విద్యాశాఖ అధికారులను ఆమె ఆదేశించారని తెలిపారు.అవసరమైతే స్పెషల్ డ్రైవ్లు చేపట్టి ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి విద్యార్థుల వివరాలను వేగ వంతంగా సేకరించి తహసిల్దార్లకు తగిన నివేదికను అందించాలని ఆమె సూచించారని అన్నారు. షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్ తెగల బాలురుకు ఐదు నుంచి ఏనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి 1వెయ్యి రూ.లచొప్పున,బాలికలకు సంవత్సరానికి 15 వందల రూ.ల చొప్పున చెల్లించడం జరుగుతుందన్నారు.రాజీవ్ విద్యా దీవెన పథకంకింద 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ.3,500ల చొప్పున అందించడం జరుగుతుందని,9వ,10వ తరగతిలు చదువుతున్న బి.సి,ఈ.బి.సి. విద్యార్థులకు రూ.4,వేల చొప్పున సంవత్సరానికి స్కాలర్ షిప్పు అందించనున్నట్లు వంశీ తెలిపారు. విద్యార్థులు కుల,ఆదాయ ధృవీకరణ విద్యార్థి పాస్పోర్ట్ ఫోటో,విద్యార్థి బ్యాంకు పాస్బుక్,మొదటి పేజీ,ఆధార్ కార్డు జిరాక్సవంటి ధృవీకరణ పత్రాలతో మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.కుటుంబ వార్షిక ఆదాయం రెండు లక్షలకంటే తక్కువ ఉండాలని,ఈ పాస్



పోర్టర్ లో రిజిస్ట్రేషన్ కాని పాఠశాలలు సత్వరమే రిజిస్ట్రేషన్ అవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచించారని దేవర వంశీ పేర్కొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా శాంతిఖని గనిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

**బెల్లంపల్లి,నవంబర్ 25(సూర్యరేఖ)** కేంద్ర ప్రభుత్వం29 కార్మిక చట్టాలను ఏకీకరించి నాలుగు లేబర్ కోడ్లుగా ప్రవేశపెట్టిన నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో శాంతిఖని గనిలో కార్మికులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.కార్మిక వర్గాన్ని కార్పొరేట్ లాభాలకు బానిసలుగా నల్ల చట్టాలివేనని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కార్మికుల పోరాటాలు త్యాగాల ఫలితంగా వచ్చిన పాత కార్మిక చట్టాలు కొంతమేర రక్షణ కల్పించేవి. లోపాలు ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రత,హక్కులకు కొంత ఆధారం ఉండేది.కానీ నూతన లేబర్ కోడ్లు పూర్తిగా ఆదాని అంబానీ వంటి కార్పొరేట్లకు అనుకూలంగా,యాజమాన్య ప్రయోజనాలను కాపాడేలా రూపొందించబడ్డాయని పేర్కొన్నారు. ఈ కోడ్లలో ఉద్యోగ భద్రత లేకపోవడం,ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ పేరుతో సేవా కాలం తగ్గించడం







చిన్న తప్పిదానికే విచారణ లేకుండా నేరుగా ఉద్యోగం నుండి తొలగించే నిబంధనలు పరిశ్రమల ఎన్నికలను యాజమాన్య ఆధీనంలోకి నెట్టే ప్రయత్నం,కార్మిక సంఘాల స్వతంత్రతను దెబ్బతీసే విధానాలు ప్రమాదకరమని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.ఈనల్ల చట్టాలను రద్దు చేసే వరకు దేశవ్యాప్తంగా పోరాటాలు కొనసాగాలని,కేంద్ర ప్రభుత్వం వెనక్కి వెళ్లే వరకూ కార్మిక వర్గం ఐక్యంగా నిలబడి పోరాడాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది.అదే విధంగా తెలంగాణలో లేబర్ కోడ్లను అమలు చేయబోమని,అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ నిరసనలో టీఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.మణిరాం సింగ్,ఐఎఫ్టియూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి.చాంద్ పాషా, సింగరేణి గని కార్మిక సంఘం కన్వీనర్ అంబాల మహేందర్, రీజియన్ నాయకులు ఎన్.ఎం. శంకర్, టిఎన్టియుసి డివిజన్ నాయకులు బొల్లు మల్లన్న, గైని తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ని ఎత్తివేయాలి





ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు

**నస్పూర్,నవంబర్25(సూర్యరేఖ)** కార్మికవర్గాన్ని నిర్వీర్యం చేసేలా,కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ని తక్షణమే ఎత్తివేయాలని ఐఎన్టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు డిమాండ్ చేశారు. కార్మిక జేఏసీ లేబర్ కోడ్స్ కి నిరసనగా చేపడుతున్న, ఆందోళన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఐఎన్టియుసి నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.దేశీయ పారిశ్రామిక రంగాన్ని,దేశ విదేశీ పెట్టుబడిదారులకు ధారాధ త్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు గనుల్లో కార్యాలయాల్లో కార్మికులు,ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం నినా దాలు చేస్తూ,శ్రీరాంపూర్ ఏరియా గని యజమా న్యానికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు గరిగ స్వామి, కలవేని శ్యామ్, పి.తిరుపతిరాజు, పేరం రమేష్, జనరల్ సెక్రటరీ ఏనుగు రవీందర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ల్యాగల శ్రీనివాస్, ఐఎన్టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## పెద్దకొరుకోండి ప్రాథమిక ఉన్నత పాఠశాల కు సౌండ్ బాక్సు,ఆట బొమ్మలు వితరణ

**ఖమ్మం,నవంబర్25(సూర్యరేఖ):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తన వంతుగా అండగా ఉంటానని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు మరసకట్ట ల బాలురాజు (శౌరీ) అన్నారు.కల్లూరు మండల పరిధిలోని పెద్దకొరుకోండి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయ దయనంద్ అనుచరుడు కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు మరసకట్టల బాలురాజు (శౌరీ) పెద్దకొరుకోండి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల పిల్లలకు పాఠశాలలో ప్రార్ధన సమయంలో అవసరమైన సౌండ్ బాక్సు గేమ్స్ కు సంబంధించిన ఆట వస్తువులను స్కూల్ యాజమాన్యానికి గ్రామస్తుల సమక్షంలో అందించారు. బాలశౌరి మాట్లాడు తూ. ప్రభుత్వ పాఠశా లలో చదువుకునే విద్యార్థులు ఆటల్లోరా ణించిపెద్ద కోరుకొండి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ప్రభుత్వ పాఠశాలలో చదివినవారే మహో న్నతమైన ఉద్యోగాల్లో ఉన్నారని విద్యార్థులకు తెలియజేశారు.





## ఎస్టి హాస్టల్ ను చూసి చలించిపోయిన సత్తుపల్లి,ఎమ్మెల్యే..



**ఖమ్మం,నవంబర్25(సూర్యరేఖ)** సత్తుపల్లి పట్టణం,జైవిఆర్,డిగ్రీ కాలేజీ ప్రాంగణంలోని ఎస్టి బాలికల హాస్టల్ ను సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టారాగమయి దయానంద్,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్,లు పరిశీలించారు.హాస్టల్ విద్యార్థినిలు ఎదుర్కొంటున్న సమస్యలు,వసతి వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు,డార్మెట్ సమస్యలు, మరుగుదొడ్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు.వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్,సబ్ కలెక్టర్లకు ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడం జరిగింది.త్వరలోనే హాస్టల్ విద్యార్థినిల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## అర్ధరాత్రి అక్రమంగా జేసీబీతో మట్టి తరలింపు

-కమ్యూనిటీ పల్లె ప్రకృతి చెట్ల తొలగింపుపై తహశీల్దార్ కు ఫిర్యాదు



**నారాయణపేట,నవంబర్25(సూర్యరేఖ):**అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారంతో పోలీసులు నిందితులు పరారయ్యారు.ఈ సంఘటన నారాయణపేట జిల్లా నర్వ మండల పరిధిలోని ఉండేకోడ్ సమీపంలో చోటుచేసుకుంది.వివరాల ప్రకారం.. ఎర్రగుట్ట మట్టిని అర్ధరాత్రి సమయంలో జేసీబీతో ఓ బిల్డర్ వెంకట్రావు అనే మేస్త్రి తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు చేరుకునే సరికి పారిపోయారు.గత ప్రభుత్వ హయాంలో గుట్టపై కమ్యూనిటీ పల్లె ప్రకృతి కింద 4 వేల చెట్లను ఏర్పాటు చేశారు.ప్రకృతి వనంలోని చెట్లను తొలగించి మట్టిని తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది అడ్డదారిలో ఎర్ర మట్టిని అమ్ముకుంటున్నారని,ఈ విషయంపై గ్రామస్తులు స్థానిక తహశీల్దార్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేయడంతో మంగళవారం గుట్టను తహశీల్దార్ మల్లారెడ్డి పరిశీలించారు.అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న వ్యక్తులు,జేసీబీ ఓనర్ పై తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మల్లారెడ్డి వివరించారు.

## కక్షపూరిత రాజకీయాలను మానుకోవాలి..


మణికొండ మున్సిపల్ మాజీ చైర్మెన్ కు సూచించిన బీఆర్ఎస్ స్థానిక పార్టీ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు

**మణికొండ,నవంబర్25 (సూర్యరేఖ)** మణికొండ మున్సిపాలిటి మాజీ చైర్మెన్ కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ స్థానిక పార్టీ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు హితవుపలికారు.ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలే తప్ప కక్షపూరితంగా వ్యవహరించడం సబబు కాదని ఆయన సూచించారు.ఈ



మేరకు ఆయన మాట్లాడుతూ...రూ.18 కోట్లు ఖర్చుపెట్టి మున్సిపల్ పాలన భవనం కట్టడం,అందుకు గాను జిల్లా ఇంచార్జి మంత్రి ఇటీవల ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు.ఈ మధ్య వచ్చిన వార్త పత్రికల సమాచారం మేరకు ఈ ప్రజా సంక్షేమ కార్యక్రమానికి స్థానిక మాజీ చైర్మన్ కు దౌత్య మర్యాదలు కల్పించలేదని,సదరు ప్రభుత్వ అధికారి అయిన మునిసిపల్ కమిషనర్ పై అలిగి భేషజాలకు పోయి ప్రారంభోత్సవానికి హాజరు కాలేదని అర్థమవుతుందన్నారు.మున్సిపల్ కార్యాలయానికి రానని మొండి పట్టు పట్టడం చూస్తుంటే ప్రజా సంక్షేమ పథకాలు,కాని అందుకు సంబంధించిన స్థానిక మున్సిపాలిటీ పురోగతిని అసలు కాంక్షించడం లేదనే విషయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. అసలు మాజీ ప్రజా ప్రతినిధులకు దౌత్య మర్యాదలు పాటించవలసిన అవసరం ప్రభుత్వ అధికారులకు లేదని,ఈ సంప్రదాయానికి భంగం కలిగించకుండా ఈ విషయమై విజ్ఞత కలిగిన స్థానిక శాసన సభ్యుడు జోక్యం చేసుకోకుండా,మాజీలకు మద్దతు కూడా పలుకడనీ అన్నారు.సదరు మాజీ ప్రజా ప్రతినిధులందరూ మెదులుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సంక్షేమ పథకాలను అమలు పరిచే విధంగా పాటు పడాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

# డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.ఏ జలీల్ పాషా, నేతలు





**ఉప్పల్,నవంబర్ 25(సూర్యరేఖ)** మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా డిసిసి నూతన అధ్యక్షులుగా నియమితులైన వజ్రేష్ యాదవ్ ను మంగళ వారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.ఏ.జలీల్ పాషా ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎం.ఏ. జలీల్ పాషా మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎదుగుతుందని వెల్లడించారు.పార్టీ ప్రతిష్ట కోసం తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ కు వారు హామీ ఇచ్చారు.పార్టీ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని వారికి సూచించారు.పార్టీలో పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, చెంచులు,మల్లేష్ తోపాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈగా బి.రాజన్న బాధ్యతల స్వీకరణ



**మంచిర్యాల,నవంబర్25(సూర్యరేఖ)** టిజిఎన్ పిడిసిఎల్ జిల్లా ఎస్ఈగా నియమితులైన బి రాజన్న బాధ్యతలు స్వీకరించారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవనం సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## ఉందేకోడ్ గ్రామంలో పందుల స్వైర విహారం

-ఊర పందుల గుంపుల దాటికి తట్టుకోలేని రైతులు
-రైతులు పండించిన వరికుప్పలను చరిపేస్తున్నాయని రైతుల ఆవేదన



**నారాయణపేట,నవంబర్25(సూర్యరేఖ)** :నారాయణపేట జిల్లా నర్వ మండలం ఉందేకోడ్ గ్రామంలో పందుల దాడి రోజు రోజుకూ పెరుగుతోంది.ఊరపందులు గుంపులుగా పంట పొలాల్లో సంచరిస్తూ వరి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతులు ఎంతో కష్టపడి సాగు చేసి పంటలు పండిస్తే,వరి కుప్పలను రాత్రి,పగలు,తేడా లేకుండా నాశనం చేస్తున్నాయని,వరి పంటలు మొలక దశలో ఉండగానే,పందులు పొలాల్లోకి దూరి పంటను తినేసి,మిగతా భాగాన్ని తొక్కేసి రైతుల కష్టాన్ని వృథా చేస్తున్నాయి.గ్రామ పరిసర ప్రాంతాల్లో పందుల ఉచ్చాటన రైతులకు తలనొప్పిగా మారింది. రైతులు రాత్రి.పగటిపూట పొలాల్లో కాపలాగా కూర్చున్న,పందుల బీభత్సం ఆగడం లేదు.పెద్ద పందులు,పిల్ల పందులు కలిసి గుంపులుగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఈ సమస్యపై ఇప్పటికే రైతులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.కార్యదర్శి పందుల యజమానులకు పలుమార్లు నోటీస్ ద్వారా విన్నపాలు చేసినప్పటికీ,ఇప్పటివరకు పందుల యజమానులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని పంచాయతీ కార్యదర్శి, రైతులు ఆరోపిస్తున్నారు.ఇకనైనా అటవీ శాఖ పశు వైద్యశాఖ ముందుకొచ్చిపందుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.పందులను పట్టుకోవడానికి ఉచ్చులు వేయడం,రాత్రి సమయంలో కాంతి దీపాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోతే రైతులు నిరసనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.మా కష్టానికి రక్షణ కల్పించాలని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.పంటలు పెరిగే కాలంలో పందుల బీభత్సం పెరగవచ్చని రైతులు భయపడుతున్నారు.ఇప్పటికే కొన్ని ఎకరాల వరి పంటలు పందుల దాడికి గురై సర్వ నాశనం కావడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పందుల దాడులపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటేనే రైతులకు ఊరట లభిస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.పందుల భారీ నుంచి మా పంటను కాపాడాలంటూ రైతులు కోరుతున్నారు.

# మాటిచ్చాం..నిలబెట్టుకుంటున్నాం

ప్రజలకిచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తా..
ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,నవంబర్25(సూర్యరేఖ)** ప్రజలకు ఇచ్చిన మాటను ఎలాంటి పరిస్థితులెదురైనా వెనకడుగు వేయబోనని రాజేంద్రనగర్ నియోజక వర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని దుర్గాహిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీలో జలమండలి నిధులతో భూగర్భ డ్రైనేజీ,మంచినీటి పైప్ లైన్ వ్యవస్థ ఏర్పాటు చేయించినందుకు ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తున్నదని, ప్రజా సౌకర్యమే తమకు అత్యంత ప్రధానమన్నారు ప్రజాహితమే తన జీవితాశయం అన్నారు.ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు.ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని తప్పక నెరువేరుస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించడం వలన ప్రజలు నన్ను నాలుగో సారి అసెంబ్లీకి పంపించారని గుర్తు చేశారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు.ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నదన్నారు. అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ,తాగునీరు సహా అన్ని మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామన్నారు. కాలనీల అవసరాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి తెలుసుకుంటూ తగు నిధులు మంజూరుతో పనులతో సమర్థంగా ముందుకు సాగుతున్నామన్నారు.దుర్గాహిల్స్ లో మంచినీటి సమస్యను అడిగిన వెంటనే పరిష్కరించి ప్రజలకు అండగానిలిచారని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టి.ప్రేమ్ గౌడ్, శ్రీధర్ గౌడ్,వెంకట్రావు,దండు వెంకటరెడ్డి, సుదర్శన్ రెడ్డి,నరేష్,విష్ణువర్ధన్ రెడ్డి,వి.విష్ణువర్ధన్ రెడ్డి,విశ్వనాథ్,జిశ్వనాథ్,కాలనీవాసులు పాల్గొన్నారు

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా







## సులేమాన్ నగర్ మున్సిపల్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ జహీరుద్దీన్

**రాజేంద్రనగర్,నవంబర్25(సూర్యరేఖ)** సులేమాన్ నగర్ డివిజన్ లో ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మున్సిపల్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ జహీరుద్దీన్ అన్నారు. మొహమ్మద్ నగర్ లో హాలిమా మస్జీద్ వెనుకాల రోడ్ నెంబర్ 31 డ్రైనేజీ,రోడ్డు పని 6నెలల నుంచి నిలిచిపోయిన సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.ఈ మేరకు జలమండలి డీజీఎం దిలీప్ ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మొహమ్మద్ జహీరుద్దీన్ మాట్లాడుతూ...స్థానికంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారంపై దృష్టి పెడుతున్నామన్నారు. మంచినీరు,రోడ్లు,వీధిదీపాలు,డ్రైనేజీ,పారిశుద్ధ్యం వంటి అన్ని అంశాలపై పార్టీ తరపున శ్రమిస్తున్నామన్నారు.ఈ మేరకు మేనేజర్ ఈశ్వర్ సైతం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్దుల్ రెహమాన్,సయ్యద్ ఇబ్రహీం,ఇమ్రాన్ పటేల్ సర్ఫారాజ్ మీనాజ్ మొహమ్మద్ జావీద్ మొహమ్మద్ శేఖర్,మొహమ్మద్ మొయిన్ మొహమ్మద్ అశ్రఫ్,మొహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ.



**నారాయణపేట,నవంబర్25(సూర్యరేఖ):** నర్వ మండల పరిధిలోని ఉందేకోడు గ్రామంలో రాష్ట్రమంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉందెకోడ్ మహిళా సమైక్య భవనంలో మంగళవారం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కొండప్ప,నాగప్ప గౌడ్,ఉమాపతి,బుల్లక్ భగవంతు ఉప్పరి శ్రీనివాసులు కుమ్మరి అంజనేయులు,జానకి రాముడు బూడిది రాజు శ్రీనివాసులు రఘు వెంకటేష్ గౌడ్,మహిళా సంఘాల సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలన

అర్హులకు త్వరలోనే గృహాల కేటాయింపు..
పీడీ మాణిక్యం



**రామాయంపేట,నవంబర్25(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణ శివారులో నిర్మాణం పూర్తైన డబుల్ బెడ్‌రూమ్ గృహాలను అర్హులైన లబ్ధిదారులకు త్వరలోనే కేటాయించనున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాణిక్యం వెల్లడించారు. మంగళవారం ఆయన రామాయంపేటలో పలు కాలనీల్లో నిర్మితమైన ద్విచక్ర గృహాల నిర్మాణం నాణ్యత,వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. తదనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఇప్పటివరకు దరఖాస్తు చేసిన వారందరిపై సమగ్ర పరిశీలన జరిపేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ డ్రా పద్ధతిలోనే గృహాలను కేటాయిస్తామని ఎటువంటి అనుమానాలు అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ గృహం చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని,కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పీడీ మాణిక్యం తెలిపారు.స్థానిక స్థాయిలో అధికారులు సిబ్బంది సమన్వయంతో ఇప్పటికే మొత్తం లిస్ట్,పరిశీలన, ఫీల్డ్ వెరిఫికేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.

# మీడియావర్సెస్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్




**నారాయణపేట జిల్లా ఎస్పీ"డాక్టర్"వినీత్**

**నారాయణపేట జిల్లా ప్రతినిధి,నవంబర్25 (సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీలో భాగంగా మంగళవారం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో మీడియా వర్సెస్ పోలీస్ జట్లమధ్య క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా కొనసాగింది.ఇలాంటి క్రీడా పోటీలు సామాజిక సమన్వయం క్రీడాస్ఫూర్తి స్నేహ బంధాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని,ఈ క్రికెట్ మ్యాచ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించి కొద్ది సేపు క్రికెట్ ఆడి క్రీడాకా రులను ఉత్సాహపరిచారు. ఎస్పీ మాట్లాడుతూ.. "పోలిస్,మీడియా రెండు సమాజానికి సేవ చేసే ముఖ్యమైన రంగాలు అని ఇలాంటి ఫ్రెండ్లీ మ్యాచ్‌లు పరస్పర అర్థం చేసుకునే స్వభావాన్ని టీమ్ స్పిరిట్‌ను మరింత పెంచుతాయని అన్నారు. అయితే టాస్ గెలిచిన మీడియా జట్టు నిర్ణీత 8ఓవర్లలో ఏడువికెట్లు కోల్పోయి 44 రన్స్ చేశారు. అనంతరం 45 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పోలీసు జట్టు6 ఓవ ర్లకు3వికెట్లు కోల్పోయి విజయం సాధించింది.కాగా ఈ మ్యాచ్‌లో మీడియా టీమ్,పోలీస్ టీమ్‌లు అద్భు తమైన ఆటతీరును ప్రదర్శించాయి. ప్రేక్షకులు,పెద్ద సంఖ్యలో హాజరైక్రీడా కారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపుఎస్పీ ఎండిరియాజ్ హూల్ హాక్,డిపిఆర్ ఓఎండి రషీద్,సిఐ శివశంకర్,డీపీఆర్ ఓరషీద్,బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్,ఎస్.ఐ.నరసింహ,ఎస్.ఐలు వెంకటేశ్వర్లు, నరేష్ శివశంకర్ జర్నలిస్టులు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళాభివృద్ధే తమ ధ్యేయం




**శంషాబాద్‌లో 932 మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ..**
**ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్,నవంబర్25(సూర్యరేఖ)** మహిళాభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు.అందులో భాగంగా 932 మహిళా సంఘాలకు రూ.1,06,29,376 పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...మహిళలు తమ ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపరచుకోవడానికి,కొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి,కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి ఈ వడ్డీ లేని రుణాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్ద పీట



వేస్తుందని,ఈ రుణాలు మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగడానికి ఒక గొప్ప అవకాశం అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# దొడ్డి దారిన బీసీలను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం




**రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చెయ్యాలి..**
**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం**

**మందమర్రి,నవంబర్25(సూర్యరేఖ)** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బీసీలకు42శాతం రిజర్వేషన్ కల్పించాలని,దొడ్డిదారిన నమ్మించి బీసీలకు వ్యతిరేకంగా ఇచ్చిన జీవో 46ను వెంటనే రద్దు చేయాలని,జరగబోయే స్థానిక ఎన్నికలలో బీసీలకు తగిన స్థానాలు కల్పించాలని మందమర్రి పట్టణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్లపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి పట్ల నిరసన జ్వాలరగిలించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్ గౌడ్ ఆదేశాల మేరకు ఉద్యమం ఉధృతం చేస్తూ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందర మంగళవారం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల వెంకటేష్, లు మాట్లాడుతూ. దొడ్డి దారిన బీసీలను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తుందని చట్టబద్ధమైన రిజర్వేషన్లు కావాలని బీసీలు కోరుతుంటే పార్టీ పరంగా ఇస్తామంటూ మాట మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నాయని బీసీలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలతో బీసీలకు 42శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ బూటకం అని,డిక్లరేషన్ పేరుతో బీసీలను మభ్యపెట్టారని చూశారని కానీ బీసీలు వాస్తవాలను తెలుసుకున్నారని చెప్పారు.నాటి నుండి నేటి వరకు బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందని రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకోలేకపోతుందని, కేంద్రప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ బీసీలకు అన్యాయం చేస్తున్నాయని దుయ్యబట్టారు.బీసీ రిజర్వేషన్ల పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీసిలతో పెద్ద డ్రామా ఆడుతున్నారని,చట్టసభల్లో రాజ్యాంగ సవరణ జరిగేవరకు ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం పట్టణ అధ్యక్షుడు గంగరాజుల రామచందర్, ముఖ్యసలహాదారుడు రామసాని శేఖర్,వర్కింగ్ ప్రెసిడెంట్ బేర వేణుగోపాలరావు ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్ల సారంగపాణి వైస్ ప్రెసిడెంట్ దేవులపల్లి ప్రభాకర్,పారుపల్లి శివరామకృష్ణ,సాగర్, ఏదులాపురం రాజు ఆర్గనైజింగ్ సెక్రటరీలు జమాల్పురి నర్సోజి మునిశెట్టి సత్యనారాయణ, మాడగోని శంకర్ పోలు కుమారస్వామి,చింతల రమేష్ మహేందర్, ఎండి హుస్సేన్,తదితరులు పాల్గొన్నారు.

## జీవో 46 తో బీసీలకు రాజకీయ అన్యాయం

**తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు..**
**జీవో రద్దు వరకు పోరాటం కొనసాగుతుందని బీసీ నేతల హెచ్చరిక..**



**రామాయంపేట,నవంబర్25(సూర్య రేఖ)** సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలపై జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తూ జీవో నెంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. రామాయంపేటలో జరిగిన బీసీ సంఘాల ఆవేదన సమావేశంలో నేతలు మాట్లాడుతూ..'జీవో 46 అమల్లో ఉండే వరకు మా పోరాటం ఆగదని హెచ్చరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. గతంలో బీసీలకు ప్రయోజనకరంగా జీవో 9 విడుదల చేసిన ప్రభుత్వమే ఇప్పుడు జీవో 46 ద్వారా బీసీలను ద్రోహం చేసిందని మండిపడ్డారు.65 శాతం బీసీ జనాభా ఉన్నప్పటికీ,రిజర్వేషన్లను తగ్గించి కేవలం 42 శాతం వరకు తీసుకురావడం అన్యాయం,అమానుషమని వ్యాఖ్యానించారు.గత ఎన్నికల్లో ఇచ్చిన రిజర్వేషన్లను ఈసారి తగ్గించడం ఏ మేర సమంజసమో ప్రభుత్వం చెప్పాలన్నారు.42 శాతం ఇస్తామని మాటిచ్చి ఇప్పుడు జీవో 46 తో వెనక్కి తగ్గడం మోసమేనని అన్నారు.బీసీలను రాజకీయంగా బలహీనపర్చే ప్రయత్నం ఆమోదయోగ్యం కాదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీసీ ఓటర్లను మేల్కొల్పి,తమ రాజకీయ శక్తిని చాటుకునే విధంగా ఉద్యమాన్ని విస్తరించే సంకల్పాన్ని ఈ సందర్భంగా ప్రకటించారు.మా ఓట్లు మేమే నిర్ణయించుకుంటాం,మాకు అన్యాయం చేసే వారిని ప్రజాస్వామ్య పద్ధతుల్లో తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం,బీసీ సంక్షేమ సంఘం,యువజన బీసీ సంఘం అధ్యక్షులు పోచమ్మల గణేష్,జిల్లా కోశాధికారి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు..

**ఆరుగురు నిందితులు అరెస్ట్..**




**రామాయంపేట,నవంబర్25(సూర్య రేఖ)** రామాయంపేట రైస్ మిల్ దొంగతనం కేసును మెదక్ పోలీసులు చేధించారు.ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రామాయంపేట పోలీసులు ఇటీవల దొంగల ధర్మారం గ్రామంలోని మహేశ్వరి బిన్ని రైస్ మిల్లో జరిగిన దొంగతనం కేసును వేగంగా ఛేదించి,మొత్తం 6 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.నిందితుల వద్ద నుండి నేరానికి ఉపయోగించిన పనిముట్లు,ఒక గూడ్స కోరియర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.రాత్రి రైస్ మిల్ షట్టర్ తాళం పగలగొట్టి గుర్తు తెలియని దొంగలు కాపర్ వైర్లు,మోటార్లు,బ్యాటరీలు,ఎర్తింగ్ ప్లేట్లు తదితర విలువైన సామాగ్రిని రూ.25 వేల విలువ ఉన్న వస్తువులను దొంగిలించినట్లు ఫిర్యాదు అందింది.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై బాలరాజు దర్యాప్తు చేపట్టారు.విచారణలో వారు రామాయంపేట కేసు సహా చేగుంట,మెదక్,తూప్రాన్,మనోహరాబాద్,శివంపేట,గౌరారం ప్రాంతాల్లో మొత్తం 8 దొంగతనాలకు పాల్పడ్డట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన వస్తువులను మెడ్చల్‌లోని ఒక స్క్రాప్ షాప్‌కు విక్రయించి నట్లు తెలిపారు.పరారీలో ఉన్న మరో 3 గురు నిందితుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని అన్నారు.స్వాధీనం చేసిన వస్తువులు గూడ్స వాహనం,కట్టింగ్ మెషీన్లు,రంచీలు,ఇనుము రాడ్లు,స్క్రూ డ్రైవర్లు,సుమారు 2 కిలోల కాపర్ వైర్లు,రూ.610 నగదు,6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసిన మొత్తం వస్తువుల విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ వివరించారు.ఈ కేసును వేగంగా చేధించినందుకు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్,రామాయంపేట సీఐ ఏ.వెంకట రాజా గౌడ్,ఎస్సై బాలరాజు,కానిస్టేబుళ్లను నాగభూషణం బాస్కర్లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## బెల్లంపల్లిలో యూత్ కాంగ్రెస్ క్రికెట్ టోర్నీ బ్యానర్ ఆవిష్కరణ




**బెల్లంపల్లి,నవంబర్25(సూర్య రేఖ)** బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో పట్టణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరగనున్న క్రికెట్ టోర్నమెంట్ బ్యానర్‌ను బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు గడ్డం వినోద్ వెంకట స్వామి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బెల్లంపల్లి యువతలో ఉన్న క్రీడాస్ఫూర్తి ప్రశంసనీయమైందన్నారు. చదువుతో పాటు క్రీడలు శారీరక,మానసిక వికాసానికి అవసరమన్నారు. యువత ప్రతిభ వెలుగొందేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో పాల్గొనడం యువతను మంచి దిశలో నడిపిస్తుందన్నారు.క్రీడలకు కావాల్సిన ప్రోత్సాహం మా నుంచి నిరంతరం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రత్నం ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు చొప్పరి శ్రీకాంత్,వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ జాబిఈమ్ము జనరల్ సెక్రెటరీ ఆసమ్ అఖిల్, టోర్నమెంట్ స్పాన్సర్ గుర్రం రాజేష్ గౌడ్,యూత్ కాంగ్రెస్ నాయకులు క్రీడాకారులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చిన ఇన్సూరెన్స్ ల అనుమతులను రద్దు చేయాలి

**కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా..**

**నారాయణపేట జిల్లా ప్రతినిధి,నవంబర్25 (సూర్యరేఖ)** తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణకార్మిక సంఘం(టియుసిఐ) ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రం ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చిన ఇన్సూరెన్స్ అనుమతులను రద్దు చేయాలని అంబేద్కర్ చౌరస్తా నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి,మున్సిపల్ పార్కు దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి అధ్యక్షత బిఓసి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నప్ప అధ్యక్షత వంచగా ముఖ్యవక్తగా తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహ,టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కిరణ్ మాట్లాడుతూ...కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కొడ్స్ వళ్ళ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు,సహజ మరణాలకు రూ.2 లక్షలకు పెంచి,శాశ్వత,పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిఓనెం.12ను 2025జులై 22న విడుదల చేసింది.జీఓ విడుదల చేసిన 2రోజులకే (ప్రైవేట్ బీమా కంపెనీలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.250 కోట్లు,ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.95 కోట్లు,ట్రెయిల్ బ్లెజర్ అనే బ్రోకర్ సంస్థ ద్వారా మొత్తం రూ.340 కోట్లు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రభుత్వ అధికారులు అక్రమంగా బదిలీ చేశారు. కేంద్ర చట్టం,రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నిధులు దారి మళ్ళించడాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘంగా తీవ్రంగా ఖండిస్తున్నాం.. సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో ప్రభుత్వం సుమారు రూ.500 కోట్లు దూర్వినియోగం చేసింది.కార్మికులకు అవసరంలేకున్న హెల్త్ టెస్టుచేయించుకోకపోతే లేబర్ కార్డులు తొలగిస్తామని కార్మికులను బెదిరిస్తూ టెస్టులు చేస్తున్నారు.33 జిల్లాల్లో 17 కేంద్రాలను ఎంపిక చేసుకొని 7మంది ల్యాబ్ మేనేజర్ల ను పెట్టి ఈ టెస్టు చేస్తున్నారు.హెడ్ ఆఫీస్ హైదరాబాద్ సోమాజి గూడలో ఉన్నది. టెస్టుఒక్కో కేంద్రంలో రోజు కు100 నుండి150 వరకు టెస్టుచేస్తున్నారు.ఒక కార్మికునికి టెస్ట్ చేస్తే రూ.3,250లు సిఎస్సి సంస్థకు బోర్డు నుండి చెల్లిస్తున్నారు.రోజువారీగా7 సెంటర్లలో సుమారు 1,000మందికి టెస్ట్ చేయడం జరుగుతుంది.ఒక్కరోజు రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల్లో 1,000 మంది కార్మికులకు టెస్ట్ చేస్తారు.టెస్ట్ చేసిన ఎంప్లా యికి సిఎస్సి సంస్థ వారు రూ.90ల చొప్పున ఇస్తున్నారు.ఒక నెలకు 30,000 మందికి, సంవత్సరానికి 3,60,000 మందికి టెస్టులు చేస్తున్నారు.ఇప్పటివరకు వెల్ఫేర్ బోర్డు నుండి సుమారు రూ.500 కోట్లు టెస్టపేరుతో దుబారా చేశారు.ఈ టెస్ట వల్ల కార్మికుల కు ఎలాంటి ఉపయోగం లేదు.ఏ ప్రభుత్వ హాస్పిటల్లోనైనా హెల్త్ టెస్టుచేస్తారు.వీరు టెస్టుమాత్రమే చేసి డాక్టర్ని సంప్రదించండని చెప్తారు.కావల్సిన మందులు వాటి కయ్యే ఖర్చులు కార్మికులే భరించాల్సి ఉంటుంది.ఈ టెస్టు సక్రమంగా రావడం లేదు.ఉన్న జబ్బులు లేనట్లుగా లేని జబ్బులు ఉన్నట్లుగా చూపుతున్నారు.సిఎస్సి నుండి ఒక వ్యక్తి యూరిన్ బ్లెడ్ తీసుకొని వెళ్ళి అన్ని టెస్టులు చేస్తున్నారు. అనవసరమైన టెస్టులు చేస్తు వేయిల కోట్ల రూపాయలు దారిమాలించ డాన్ని కండించారు. పైసమస్యల పరిస్కారం కోసం డిసెంబర్ 5న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికుల కుపిలుపునిచ్చారు.ఈ ధర్నా అనంతరం తహసిల్దార్ అమరేందర్ కృష్ణకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈకార్యక్రమంలో తాపీ మేస్త్రి సంఘం నాయకులు నారాయణపేట జిల్లా నాయకులు హాజీ మలాంగ్ వెంకటయ్య నగేష్ తిమ్మయ్య అశోక్,దేవప్ప,నరేష్,వెంకటప్ప,శంకర్, కథలప్ప హనుమ దాసు రాజు మహేష్ అశోక్ శరణప్ప నరేష్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.






# కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి**

**ఐఎన్టీయూసీ పట్టణ అధ్యక్షుడు రంజిత్ గౌడ్**

**మందమర్రి,నవంబర్25(సూర్యరేఖ)** కార్మికులు పోరాటం చేసి సాధించు కున్న హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఐఎన్టీయూసీ మందమర్రి పట్టణ అధ్యక్షులు వడ్లకొండ రంజిత్ గౌడ్ డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేపట్టాలని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్,రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ ఐఎన్టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంచిర్యా ల జిల్లా అధ్యక్షులు రాంశెట్టి నరేందర్ ఆదేశాను సారం స్థానిక యాపల్ ప్రాంతంలో కాంట్రాక్టు కార్మికులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా రంజిత్ గౌడ్ మాట్లాడు తూ..పాత 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్లుగా మార్చడంతో కార్మికుల ప్రయోజనాలకు ఉద్యోగ భద్రతకు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.కార్మికులకు ఎంతో రక్షణగా,ధీమాగా ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా కుదించి కార్మికుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతుందని ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం గ్రాట్యుటీ హక్కు బోనస్ హక్కు ఉద్యోగ భద్రత హక్కు పీఎఫ్ ఈఎస్ఐ తదితర హక్కులను హరించేలా ప్రస్తుత చట్టాలను రూపొందించారని ఈ చట్టాల వలన కార్మికుల హక్కులు,భద్రత పెన్షన్ పని గంటలు వేతనాలు తదితరాల్లో కార్మిక హక్కుల్లో కోతలు ఉన్నాయని,కార్మికుల శ్రమ దోపిడీ జరగటమే కాక,కార్మిక సంఘాలు కూడా నిర్వీర్యమైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలను జాతీయం చేసి కోట్లాది ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టిస్తే, ప్రస్తుత మోడీ ప్రభుత్వం దేశ సంపదను ఆధాని అంబానీలకు కట్టబెట్టడానికి చేస్తున్న ప్రయత్నంలోనే భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నదని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ ప్రధాని మోడీని కలసి వెంటనే ఈ 4 కార్మిక కోడ్లను రద్దు చేయని పక్షంలో ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి మార్గదర్శకత్వంలో,ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ నాయకత్వంలో దేశవ్యాప్త ఉద్య మానికి ఐఎన్టీయూసీ సిద్ధంగా ఉన్నదని హెచ్చరిం చారు. కార్మిక లోకమంతా ఐక్యమత్యంతో కలిసికట్టుగా ఉండి మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని రంజిత్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తిప్పని శ్రీనివాస్,సట్ల మహేందర్, కోడిపుంజుల రాకేష్ గోలేటి రాజు,ఖలీల్,కాంటాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# కోనాపూర్ సొసైటీ భారీ దుర్వినియోగం

**రూ.1.65 కోట్లు వెంటనే రికవరీ చేయాలని డిమాండ్..**

**సభ్యుల డబ్బులపై దోపిడి..**

**కోనాపూర్ సొసైటీ కుంభకోణంపై ఆగ్రహం**

**రామాయంపేట,నవంబర్25(సూర్య రేఖ)** కోనాపూర్ సహకార సొసైటీలో వెలుగుచూసిన భారీ ఆర్థిక అవకతవకలపై స్థానిక నాయకులు సొసైటీ డైరెక్టర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల చెమట చిందించిన ధనంలో రూ.1.65 కోట్ల దుర్వినియోగం చేయబడ్డాయన్న ఆరోపణల పై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు.ఈ మేరకు మంగళవారం సొసైటీ డైరెక్టర్లు నందు మైపాల్ రెడ్డి,మామిడి సిద్ధరాములు, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రామచందర్ గౌడ్ లు మాట్లాడుతూ..సభ్యుల కష్టార్జిత డబ్బును ఇలా దోపిడీ చేయడం అత్యంత భయంకరమైన విషయమని,ఇంత పెద్ద మొత్తం రూపాయలు దుర్వినియోగం అవడం సొసైటీ చరిత్రలోనే నల్లపుటగా మిగిలిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్వినియోగం చేసిన మొత్తాన్ని వెంటనే పూర్తి గా రికవరీ చేయాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని కోరారు.కాంగ్రెస్ టీపీసీసీ అధికార ప్రతినిధి రామచందర్ గౌడ్ మాట్లాడుతూ..ప్రజల నిధులను లూటీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టమని,సొసైటీ నిధుల దుర్వినియోగం దేశ చట్టం ముందు ఘోర నేరం,తప్పు చేసిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.అతను దుర్వినియోగం చేసిన ప్రతి రూపాయిని తక్షణమే సొసైటీ ఖాతాలో జమ చేయాలని,అధికార వ్యవస్థలో ఎవరైనా నిర్లక్ష్యం చేసి ఉంటే వారిపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.కోనాపూర్ సొసైటీలో చోటుచేసుకున్న ఈ అవకతవకలపై రైతులు,సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



## చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన దీక్షా దివస్ జయప్రదం చేయాలి

**తెలంగాణ భవనంలో 27న సన్నాహక సమావేశం..**



**నాంపల్లి,నవంబర్25(సూర్యరేఖ)** తెలంగాణ వచ్చుడో,కేసీఆర్ సచ్చుడో అన్న తెగువతో నాలుగు కోట్ల ప్రజలను ఏకం చేసి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాజకీయ వ్యవస్థలను ఏకతాటిపైకి తెచ్చి చేసిన దీక్షా దివస్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఠాకూర్ జీవన్ సింగ్ మాట్లాడుతూ..ఈ నెల 29న దీక్షా దివస్ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ ముఖ్య నాయకులతో 27 న మధ్యాహ్నం తెలంగాణ భవనంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై దిశా నిర్దేశం చేయనున్నారని,కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని పార్టీ,పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు కాంటెస్టెడ్ కార్పొరేటర్లు పాల్గొనవలసిందిగా కోరారు.ఈ నెల 29న దీక్షా దివస్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఠాకూర్ జీవన్ సింగ్ పిలుపు నిచ్చారు.

## ఎంపీ వంశీకృష్ణకు ప్రోటోకాల్ ఎందుకు పాటించడంలేదో అధికారులు స్పష్టతనివ్వండి

**కాంగ్రెస్ పార్టీ నేతలు**



**మందమర్రి,నవంబర్25(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్ల ప్రోటోకాల్ ను పారదర్శకంగా పాటించకుండా పెద్దపల్లి జిల్లా అధికార యంత్రాంగం విస్మరిస్తుందని పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్తుకు సుదర్శన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైడిమల్ల నర్సింగ్ లు మాట్లాడుతూ..కాళేశ్వరం పుష్కరాలు మంచిర్యాల జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలు,రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి స్థల పరిశీలనకు వచ్చిన సమయంలో కూడా ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ యంత్రాంగం అవమానించడం సిగ్గుచేటని మండిపడ్డారు.పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ పేరును చేర్చకుండా ప్రోటోకాల్ పాటించకూడదని ఎవరు చెప్పారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఎంపీ వంశీకృష్ణకు పెద్దపల్లి పార్లమెంట్ లో జరుగుతున్న అన్యాయంపై సీఎం రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్ర రాజు,ఏడుకొల పవన్,ఇసాక్,రాజ్ కుమార్ రాయ బారపు కిరణ్,చిప్పకుర్తి శశిధర్,జావిద్ ఖాన్,ముదారపు శేఖర్, విజయ్ ఖలీల్,మహంత్ రవి,మాసు సంతోష్,మాయా తిరుపతి,పోలు సంపత్ చోటు సతీష్ యాసిన్ సుధాకర్, మల్లేష్,కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర లేబర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా శశిభూషణ్..




**నాంపల్లి,నవంబర్25(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ సాయి నగర్ లో నూతనంగా శ్రీ వెంకటేశ్వర లేబర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి నూతన కమిటీ వేయ డం జరిగింది.శ్రీ వెంకటేశ్వర లేబర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా శశిభూషణ్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంమా వేశంలో శశి భూషణ్ మాట్లాడుతూ. భవన,ఇతర నిర్మాణ కార్మికులు,మహి ళా కార్మికులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టాయన్నారు.భవన నిర్మాణ కార్మికులు రాష్ట్ర సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోవాలని నమోదు చేసుకున్న తర్వాత కార్మికులు వివిధ రకాల ఆర్థిక సహాయం, బీమా,పిల్లల విద్య వంటి ప్రయోజనాలను పొంద వచ్చని అన్నారు.పని ప్రదేశంలో ఇతర ప్రమాదాలలో మరణం,శాశ్వత వైకల్యం సంభవించినప్పుడు కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం,ఆరోగ్య భీమా కవరేజ్ అందించబడు తుందన్నారు.నమోదు చేసుకున్న కార్మికుల పిల్లల చదువుల కోసం స్కాలర్షిప్లు అందించబడుతుందని,మహిళా కార్మికులకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు.మొదటి సమావేశంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శిరీష చేతుల మీదుగా 200 మందికి లేబర్ కార్డులను అందజేయడం జరిగిందన్నారు.



## సింగర్‌గా మారేందుకు నవీన్ పొలిశెట్టి ఇబ్బందులు..

## అనగనగా ఒక రాజు ఫస్ట్ సింగిల్ ఆన్ ది వే

జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు మారి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 2026 జనవరి 14న ఈ మూవీ గ్రాండ్‌గా విడుదల కానుంది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంతో నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారబోతున్నాడని తెలిసిందే. దీనికి సంబంధించి అధికారిక అప్‌డేట్ వచ్చేసింది. నవీన్ పొలిశెట్టి పాడిన భీమవరం బల్మా పాటను నవంబర్ 27న లాంచ్ చేయనున్నట్టు షేర్ చేశారు మేకర్స్. పండగకు స్టెప్పులు వేయడానికి రెడీగా ఉండండి.. అంటూ ప్లేబ్యాక్ సింగర్ కావడానికి నవీన్ పొలిశెట్టి పడుతున్న కష్టాలను చూపిస్తూ ఫన్నీగా కట్ చేసిన వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్ఛ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్ల ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై అంచనాలు అమాంతం చేస్తోంది.



## ఆంధ్ర కింగ్ తాలూకా.. వామ్మో రన్ టైమ్ చాలా ఎక్కువే..!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, భాగ్యశ్రీ హీరో, హీరోయిన్లుగా నటిస్తోన్న లేటేస్ట్ మూవీ 'ఆంధ్రా కింగ్ తాలూకా' ఈ సినిమాకు మహేశ్ బాబు.పి దర్శకత్వం వహించారు. ఓ సినిమా హీరో అభిమాని జీవితం ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్, ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి క్రేజీ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేట్ జారీ చేసింది సెన్సార్ బోర్డ్. ఈ మూవీ రన్ టైమ్ రెండు గంటల 40 నిమిషాలుగా(యాడ్స్, టైటిల్స్‌తో సహా) ఉండనుంది. కాగా.. ఈ చిత్రంలో ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా నవంబర్ 27న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రంలో హీరో అభిమాని పాత్రలో రామ్ కనిపించనున్నారు.

## ప్రేక్షకులకు మనసైతే కనక వర్షమే



రాజు వెడ్స్ రాంబాయిలో ఒక పాటుంది. నీ మీద నాకు మనసాయెనే అంటూ హీరోయిన్ ని ఉద్దేశించి హీరో పాడతాడు. ఇది ఇప్పుడీ సినిమా ఫలితానికి కూడా సరిగ్గా అన్వయించుకోవచ్చు. పెద్దగా అంచనాలు లేకుండా తక్కువ హైప్ తో రిలీజైన ఈ మూవీ కేవలం మూడు రోజులకే ఏడు కోట్ల గ్రాస్ దాటేయడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. మొదటిరోజు కన్నా శని ఆదివారాల కలెక్షన్లు ఎక్కువగా ఉండటం ఊహించని పరిణామం. తొమ్మిదికి పైగా సినిమాలతో పోటీ ఉన్నప్పటికీ రాంబాయి రాజుల ప్రేమకథ ఇంతగా ఆడియన్స్ కి కనెక్ట్ కావడం చూస్తే ప్రేక్షకులకు మనసైతే కనకవర్షం ఖాయమే అని అర్థం చేసుకోవచ్చు.



## ఆస్కార్ బరిలో మన సినిమా.. ఇదీ రికార్డే

ఆస్కార్ అవార్డ్ అనేది ప్రతి ఇండస్ట్రీ కల. భారతీయ సినిమాలకు, మరీ ముఖ్యంగా దక్షిణాది చిత్రాలకు చాన్నాళ్ల పాటు ఇది అందని ద్రాక్షలానే మిగిలింది. కానీ 'ఆర్ఆర్ఆర్'లోని నాటు నాటు పాటకు పురస్కారం దక్కడంతో యావత్ భారతదేశం సంతోషంతో ఉప్పొంగింది. ఇప్పుడు మరో హిట్ మూవీ.. ఆస్కార్ బరిలో నిలిచింది. అదే ఈ ఏడాది వందల కోట్లు సాధించి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న 'మహావతార్ నరసింహ'. సలార్, కేజీఎఫ్ తదితర మూవీస్ తీసిన హొంబలే ఫిల్మ్స్ నుంచి ఈ ఏడాది వచ్చిందీ యానిమేషన్ సినిమా. జూలై 25న ఏ మాత్రం అంచనాల్లేకుండా థియేటర్ల రిలీజ్ చేశారు. తొలివారం పాజిటివ్, మౌత్ టాక్ రావడంతో ఓ మాదిరి కలెక్షన్ వచ్చాయి. రెండో వారం నుంచి ఇక తగ్గేదే లే అనేలా దూసుకుపోయింది. రూ.30-40 కోట్ల బడ్జెట్‌తో తీస్తే ఓవరాల్‌గా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పాన్ ఇండియా లెవల్లో సరికొత్త రికార్డులు సృష్టించింది.

ఇకపోతే ఇప్పుడీ సినిమా ఆస్కార్ బరిలోనూ నిలిచింది. 2026 ఆస్కార్ పోటీలో ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో పలు దేశాల నుంచి వచ్చిన 35 సినిమాల్లో 'మహావతార్ నరసింహ' కూడా ఒకటిగా నిలిచింది. మన దేశం నుంచి ఆస్కార్ బరిలో నిలిచిన తొలి యానిమేటెడ్ చిత్రం ఇదే కావడం విశేషం. ఒకవేళ ఆస్కార్? గెలుచుకుంటే మాత్రం అది మరొక అద్భుతం అవుతుందడంలో ఎలాంటి సందేహం లేదు. మహావతార్ నరసింహ సినిమా విషయానికొస్తే.. శ్రీ మహావిష్ణువు, నరసింహావతారం ఆధారంగా రూపొందిన చిత్రమిది. మీరు సృష్టించిన ఏ జీవి వల్ల, ఎలాంటి కాలంలోనూ ఏ అస్త్ర శస్త్రాల నుంచి తన ప్రాణాలకి ముప్పు కలగకూడదని బ్రహ్మ దేవుడి నుంచి రాక్షసరాజు హిరణ్యకశిపుడు వరం పొందుతాడు. ఆ తర్వాత ముల్లోకాలకు తానే అధిపతినని, తానే భగవంతుడినని ప్రకటించుకుంటాడు. భూలోకంలో ధర్మాన్ని కాలరాస్తాడు. తన సోదరుడి మరణానికి కారణమైన మహావిష్ణువుపై మరింత కోపంతో రగిలిపోతుంటాడు. కానీ తన కుమారుడు ప్రహ్లాదుడు... శ్రీవిష్ణువుకి మహా భక్తుడిగా మారతాడు. ఇది సహించలేని హిరణ్యకశిపుడు.. ప్రహ్లాదుడిని చంపేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? తనకెంతో ప్రీతిపాత్రమైన భక్తుడు ప్రహ్లాదుడిని మహావిష్ణువు ఎలా కాపాడుకున్నాడు? ఎలాంటి పరిస్థితుల్లో నరసింహావతారం ఎత్తాల్సి వచ్చింది? హిరణ్యకశిపుడి సంహారం ఎలా జరిగింది? అనేదే సినిమా స్టోరీ.



## భాగ్యశ్రీతో డేటింగ్ రూమర్స్.. స్పందించిన రామ్ పోతినేని!

హీరో రామ్ పోతినేని నటి భాగ్యశ్రీ బోర్సే ప్రేమలో ఉన్నారనే వార్త గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'ఆంధ్రకింగ్ తాలూకా' మూవీ షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిందని..అది కాస్త స్నేహబంధం దాటి ప్రేమగా మారిందనే ప్రచారం జోరుగా సాగింది. తాజాగా ఈ పుకార్లపై హీరో రామ్ పోతినేని స్పందించారు. ఆంధ్రాకింగ్ తాలుకా మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో రామ్ మాట్లాడుతూ.. భాగ్యశ్రీతో డేటింగ్ అనేది కేవలం రూమర్ మాత్రమే అని స్పష్టం చేశారు. 'ఆంధ్రకింగ్ తాలుకా' సినిమా కోసం నేను ఒక ప్రేమ గీతం రాశాను. అప్పటి నుంచి ఈ రూమర్స్ మొదలయ్యాయి. భాగ్యశ్రీ పై మనసులో ప్రేమ లేనిదే ఇంత గొప్ప పాట ఎలా రాయగలడు? అని అంతా అనుకున్నారు. వాస్తవం ఏంటంటే.. ఈ సినిమాలో హీరోయిన్‌ని ఎంపిక చేయకముందే నేను ఆ పాట రాశాను. సినిమాలో హీరో, హీరోయిన్ల పాత్రలను ఊహించుకొని ఆ లిరిక్స్ రాస్తే..అంతా మరోలా అనుకున్నారు' అని రామ్ చెప్పుకొచ్చారు. ఇక ఇదే విషయంపై మరో ఇంటర్వ్యూలో భాగ్యశ్రీ కూడా స్పందించారు. రామ్ తనకు మంచి స్నేహితుడు మాత్రమే నని.. ఒక నటుడిగా ఆయన అంటే తనకు ఎంతో గౌరవం అని చెప్పింది. ఆయన డెడికేషన్ చూసి ఎంతో నేర్చుకున్నానని..అంతకు మించి తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఆంధ్రకింగ్ తాలుకా సినిమా విషయానికొస్తే..పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రామ్‌కి జోడీగా భాగ్యశ్రీ నటించింది. ఇందులో రామ్ ఒక స్టార్ హీరోకి అభిమానిగా నటించబోతున్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర కీలక పాత్ర పోషించిన ఈ మూవీ నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,